ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 6 జూన్ 2024

పరువు పోయే..



- వైసీపీలో క్రాస్ ఓటింగ్
- ఎమ్మెల్యేకు నై.. ఎంపీకి జై
- మాపై ఇంత వ్యతిరేకత ఉందా...
- అంతర్మథనంలో వైసీపీ
- క్రాస్ ఓటింగ్‌తో బీజేపీకి దెబ్బ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఓటు కూటమికి.. ఎంపీ ఓటు వైసీపీ అభ్యర్థికి... ఇలా పలు నియోజకవర్గాలలో ఓట్లు పడడంతో అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు పరువుపోయిందని ఆవేదన చెందుతున్నారు. పార్టీ ఒకటే.. గుర్తు ఒకటే.. అయితే మాకు ఓటు వేయని ఓటర్లు ఎంపీ అభ్యర్థికి వేశారు. అంటే.. మా పట్ల ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఉందా? అని ఆందోళన చెందుతున్నారు. మొగుడు కొట్టినందుకు బాధ లేదు.. తోడుకోడలు నవ్వినందుకే బాధ.. అనే చందంగా తమ పరిస్థితి తయారైందని వాపోతున్నారు. రాజంపేట పార్లమెంటు పరిదిలోని ఏడు నియోజకవర్గాలలో నాలుగు స్థానాలు కూటమి గెలుపొందింది. మూడింటితోనే అధికార పార్టీ సరిపెట్టుకుంది. కూటమి గెలుచుకున్న అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల మెజార్టీ, మూడు స్థానాల్లో గెలిచిన వైసీపీ అభ్యర్థులకు వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ ఉంది. ఈ ప్రభావం రాజంపేట పార్లమెంటు కూటమి అభ్యర్థిపైన పడింది. ఈ మెజార్టీ ప్రకారం రాజంపేట పార్లమెంటు స్థానం కూటమి బీజేపీ అభ్యర్థి అయిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపొందాలి. అయితే వైసీపీ అభ్యర్థి మిధున్‌రెడ్డి గెలుపొందారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా అధికార పార్టీలోని క్రాస్ ఓటింగ్ గురించి చర్చించుకుంటున్నారు.



క్రాస్ ఓటింగ్ వ్యవహారాన్ని ఒకసారి పరిశీలిస్తే..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పోల్చితే రాయచోటి నియోజకవర్గంలో క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరిగింది. శ్రీకాంత్‌రెడ్డికి పడిన ఓట్ల కంటే.. మిధున్‌రెడ్డికి ఎక్కువగా పోలయ్యాయి. రాయచోటి నియోజకవర్గంలో 1,96,012 ఓట్లు పోలయ్యాయి. అందులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి 95,925 ఓట్లు పోలయ్యాయి. శ్రీకాంత్‌రెడ్డికి 93,430 ఓట్లు పడ్డాయి. రాజంపేట పార్లమెంటు స్థానానికి రాయచోటి సెగ్మెంటులో బీజేపీ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి 70,568 ఓట్లు పడ్డాయి. వైసీపీ అభ్యర్థి మిధున్‌రెడ్డికి 1,00,200 ఓట్లు వచ్చాయి. ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డికి పోలైన ఓట్ల కంటే మిధున్‌రెడ్డికి 6770 ఓట్లు ఎక్కువగా పడ్డాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులుకు 67,493 ఓట్లు వచ్చాయి. ఎంపీ అభ్యర్థి మిధున్‌రెడ్డికి 69,510 ఓట్లు పడ్డాయి. 2017 ఓట్లు క్రాస్ ఓటింగ్ జరిగింది. తంబళ్లపల్లెలో 1546 ఓట్లు క్రాస్ ఓటింగ్ జరిగాయి. పీలేరు నియోజకవర్గంలో 3,113 ఓట్లు క్రాస్ ఓటింగ్ జరిగాయి. మదనపల్లె, రాజంపేట నియోజకవర్గాలలో అతి తక్కువ సంఖ్య ఓట్లు క్రాస్ ఓటింగ్ జరిగాయి. పుంగనూరు నియోజకవర్గంలోనూ క్రాస్ ఓటింగ్ జరిగింది. వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి 1,00,793 ఓట్లు పోలయ్యాయి. ఎంపీ అభ్యర్థి మిధున్‌రెడ్డికి 1,04,833 ఓట్లు పడ్డాయి. ఈ రెండింటి మధ్య తేడా.. 4040 ఓట్లు. ఇలా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ.. ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే ఎంపీ అభ్యర్థికే ఎక్కువ ఓట్లు పడ్డాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ముస్లిం మైనార్టీల ఓట్లు గణనీయంగా ఉన్నాయి. వీరిలో అత్యధికులు ఎమ్మెల్యే ఓటు కూటమి అభ్యర్థికి వేసి.. ఎంపీ ఓటు మాత్రం వైసీపీకి వేసి ఉంటారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. అదే సమయంలో స్థానికంగా ఉన్న పలువురు ఎమ్మెల్యేలపైన సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. ఐదేళ్లలో తమను ఏమాత్రం పట్టించుకోలేదనే అభిప్రాయం అధికారపార్టీకి చెందిన ఎక్కువ మంది నాయకులు, కార్యకర్తల్లో బలంగా ఉంది. దీంతో ఎమ్మెల్యేకు ఓటు వేయకుండా.. పార్టీ మీద అభిమానంతో ఎంపీ అభ్యర్థికి ఓటు వేశారని పలువురు పేర్కొంటున్నారు. దీంతో అధికార పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు పరువు పోయిందే..! అని ఆవేదన చెందుతున్నారు.

ఎన్డీయే కూటమి విజయం చరిత్రాత్మకం



మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

- చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి
- రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూన్ 5: టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీయే) కూటమి విజయం చరిత్రాత్మకమని తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఎన్డీయే కూటమి విజయం సాధించడం పట్ల జగన్‌మోహన్‌రాజు అధ్యక్షతన కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ అధినేత్రి ఇందిరాగాంధీ అహంకారాన్ని భరించలేక నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి రాష్ట్రంలో ఎలాగైతే చరిత్రాత్మక విజయాన్ని అందించారో అదే బాటలో నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహంకారపూరిత నియంత పరిపాలనకు చరమగీతం పాడుతూ చంద్రబాబు సారథ్యంలో ఎన్డీయే కూటమి చరిత్రాత్మక విజయాన్ని సాధించిందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అహంకారపూరిత రాజకీయాలు మనుగడ సాగించలేవన్నారు. అందుకు నిదర్శనం ఈ ఎన్నికల ఫలితాలే అన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు సమయంలో తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు, నారా లోకేశ్‌కు అండగా నిలబడి ఎన్డీయే కూటమి ఏర్పాటులో ప్రధానపాత్ర పోషించి కూటమి అఖండ మెజారిటీకి పాటు పడిన జనసేనాని పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువనేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రభావం ఈ ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించిందన్నారు. అదేవిధంగా రాజంపేట నియోజకవర్గంలో చోటు చేసుకున్న చిన్నచిన్న పొరపాట్లను సరిదిద్దుకుని వచ్చే ఎన్నికలకు నియోజకవర్గాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మదనపల్లెలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా గెలుపులో కీలకపాత్ర పోషించిన జగన్‌మోహన్‌రాజును కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, పార్లమెంటు అధికార ప్రతినిధి అమ్మనేని అజయ్‌కుమార్, సిద్దవటం మాజీ జడ్పీటీసీ చలమయ్యయాదవ్, ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణనాయుడు, సిద్దవటం యువ నాయకుడు రాజానాయుడు, మండల సీనియర్ నాయకులు జీవీ సుబ్బరాజు, చవనవారిపల్లె సర్పంచు కోటయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఆర్.సతీష్‌కుమార్‌రాజు, ఒంటిమిట్ట యువ నాయకుడు హరినాథరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు పోలి శివకుమార్, తెలుగు యువత పార్లమెంటు అధికార ప్రతినిధి సింగన పరుశురాంనాయుడు, తెలుగుయువత పార్లమెంటు సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సూర్యనారాయణరాజు, ఒంటిమిట్ట శివారెడ్డి, సిద్దవటం మండల బీసీ నాయకులు గాలి సుబ్బయ్య, కొల్లావారిపల్లె పవన్‌కుమార్, అన్ని మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసంద్రంగా రాయచోటి టీడీపీ కార్యాలయం

- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వెల్లువెత్తిన అభినందనలు



మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న దిగువ అబ్బవరం టీడీపీ నేతలు

రాయచోటి టౌన్, జూన్ 5: ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజయం సాధించడంతో బుధవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల పార్టీ కార్యాలయం జన సంద్రంగా మారింది. పులివెందుల తర్వాత మరో పులివెందులగా చెప్పుకునే వైఎస్ జగన్‌మోహన్ అడ్డా అయిన వైసీపీ కంచుకోట రాయచోటిలో టీడీపీ జెండా రెపరెపలాడడంతో బుధవారం రాయచోటి పట్టణమంతా పసుపుమయంగా మారింది. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పార్టీ మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఇలా అన్ని వర్గాల ప్రజలు టీడీపీ కార్యాలయం వద్దకు తండోపతండాలుగా తరలి వచ్చి గజమాలలు, బొకేలు, పూలమాలలతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తన కోసం వచ్చిన అందరికీ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

పెద్దిరెడ్డి అరాచకాలకు చరమగీతం

- తంబళ్లపల్లె ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటా
- తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 5: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేసిన అరాచకాలను వదలమని, వైసీపీ చేసిన దౌర్జన్యాలకు తగిన సమాధానం చెబుతానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అన్యాయాలు, భూకబ్జాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్‌లు, అక్రమ మైనింగ్‌లను బయట పెట్టి కచ్చితంగా కటకటాల వెనక్కి పంపుతానని తెలిపారు. ఐదు నెలల ముందు పార్టీలోకి వచ్చిన నాకు 85 వేల మంది మద్దతు ఇచ్చారని, ఇది నా గొప్పతనం కాదని పార్టీ, ప్రజల గొప్పతనమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. నాకు మద్దతిచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. గెలుపోటములు సహజమని, తాను ఓడిపోలేదని నైతికంగా గెలిచానన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టి, అక్రమంగా కేసులు పెట్టి ఎవరైతే జైలుకు పంపారో వారిని వదలనన్నారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం అయిన వెంటనే కౌంట్‌డౌన్ మొదలుపెడతామన్నారు. కొందరు ఇన్‌చార్జ్‌ని మారుస్తారని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది జరగదని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. సమావేశంలో తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, ఆనందరెడ్డి, వైజీ సురేంద్రయాదవ్, నారాయణస్వామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయకులు రామాంజులు, గాండ్ల రెడ్డెప్ప, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటమితో ఎవరిపై నిందలు వేయను

- లోపాలను సరిదిద్దుకుని పార్టీని ముందుకు తీసుకెళ్తా
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, జూన్ 5: రాజంపేటలో ఓటమికి ఎవరిపై నిందలు వేయనని, ఓటమికి గల కారణాలు విశ్లేషించుకుని వాటిని సరిదిద్దుకుని, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని ఇప్పటి నుంచి సమాయత్తం చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. బుధవారం రాజంపేట నవీన్‌చంద్ర కల్యాణ మండపంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటలో కొన్ని కారణాల వల్ల తాను ఓడిపోయానని, దానిపై విశ్లేషించి తప్పులు సరిదిద్దుకుని ముందుకు సాగుతామన్నారు. ఇప్పటి నుంచి పార్టీని పటిష్టపరచి కార్యకర్తలందరికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత పదవులు రావడానికి కృషి చేస్తానని తెలిపారు. మండలాధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు ఇలాంటి పదవులు కార్యకర్తలకు రావడానికి పార్టీని పటిష్టపరచి అన్ని గ్రామాల్లో పార్టీని ముందుకు తీసుకెళ్తానన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలో కూటమి అభ్యర్థులు 163 స్థానాలు కైవసం చేసుకోవడం దేశ చరిత్రలోనే పెద్ద రాజకీయ ఘట్టమన్నారు. రాజంపేట నియోజక వర్గాన్ని చంద్రబాబు ఆశీస్సులతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినందున రాజంపేటలో ఓటమి చెందినా కార్యకర్తలకు ఎటువంటి అన్యాయం జరగదన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు ఎంతో కష్టపడి పని చేశారని తాను తక్కువ సమయంలో రావడం అందరినీ కలవలేకపోవడం కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవడం వల్ల స్వల్ప ఓట్లతో ఓటమి చెందామన్నారు. రాజంపేటలో మనం నైతికంగా విజయం సాధించినట్లేనన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఊటుకూరు నాయకుడు నామా హరి ఆధ్వర్యంలో సుబ్బరాయుడు, రవీంద్ర తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బనరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షుడు బీఆర్ ఎల్ మణి, టీడీపీ ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి, టీడీపీ మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కుసుమకుమారి, రాజంపేట మహిళా ఉపాధ్యక్షురాలు వాణి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యెద్దల విజయసాగర్, సిద్దవటం నాయకులు రామచంద్రయ్య, రాష్ట్ర బీసీ నాయకులు ఇడిమడకల కుమార్, ఎస్సీ సెల్ నాయకులు మందా శ్రీనివాసులు, సుండుపల్లె మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప, రాజంపేట పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మండల మాజీ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఒంటిమిట్ట మండల నాయకులు రమణ, రాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాపనయ్యనాయుడు, వెంకటేశ్వరనాయుడు, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణిలతో పాటు రాజంపేట, నందలూరు నాయకులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

కార్యకర్తలతో కిక్కిరిసిన నగరిపల్లె

- ప్రజలకు అండగా ఉంటా : నల్లారి




కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 5: పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామం నగరిపల్లె టీడీపీ శ్రేణుల తాకిడితో బుధవారం కిక్కిరిసింది. పదేళ్ల విరామం తరువాత విజయం సాధించిన ఆయనను అభినందించడానికి జనం క్యూ కట్టారు. బారులు తీరిన జనసందోహంతో నగరిపల్లె కిటకిటలాడింది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి నల్లారి అభిమానులు సందడి చేశారు. విజయోత్సాహంలో ఉన్న పార్టీ శ్రేణులు ఆయనను అభినందనలతో ముంచెత్తారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వచ్చిపోయే జనాలతో గ్రామం తిరుణాలను తలపించింది. జన జాతరతో ఉక్కిరిబిక్కిరైన కిశోర్‌కుమార్‌రెడ్డి మేడ పైకి వెళ్లి ప్రజలనుద్దేశించి మైకులో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు సంయమనం పాటించాలని, తనకు అండగా నిలబడిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని చెప్పారు. అధికార పార్టీతో ఐదేళ్లుగా జరుపుతున్న పోరాటానికి ఫలితంగా ప్రజలు విస్పష్టమైన తీర్పునిచ్చారని కొనియాడారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కిశోర్‌కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులైన ఆయన సతీమణి తనూజా రెడ్డి, కుమారుడు డాక్టర్ అమరనాథ రెడ్డి, కోడలు డాక్టర్ షమా రెడ్డి, కుమార్తె డాక్టర్ వైష్ణవిలు ప్రజలకు బాగా పరిచయం కావడంతో వారందరూ మేడ పైకి రావాలని జనం పట్టుబట్టారు. ప్రజల కోసం తాము బాధ్యతగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా డాక్టర్ అమరనాథరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం వరకూ ప్రజల రాకపోకలు కొనసాగుతూనే ఉన్నాయి. నగరిపల్లెకు వెళ్లే రహదారి వాహనాలతో కిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్ వెంటనే సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. అనంతరం ఎర్రబల్లి జంక్షన్ వద్ద నుంచి వాహనాలను నాలుగు లేన్ల జాతీయ రహదారిపై అటు పీలేరు, ఇటు మదనపల్లె వైపునకు మళ్లించి పార్కింగ్ చేయించడంతో మధ్యాహ్నం తరువాత మార్గం సుగమమైంది.

టీడీఎల్పీ సమావేశానికి కిశోర్‌కుమార్ రెడ్డి

కాగా టీడీఎల్పీ సమావేశానికి సంబంధించి పార్టీ వర్గాల నుంచి సమాచారం రావడంతో బుధవారం సాయంత్రం కిశోర్‌కుమార్ రెడ్డి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. గురు, శుక్రవారాల్లో టీడీఎల్పీ సమావేశాలు జరగనున్నట్లు తెలుస్తోంది. రాజధాని అమరావతిలోనే ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.

అరాచకమే వారిని తుడిచిపెట్టేలా చేసింది : ఎమ్మెల్యే



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, జూన్ 5: రాష్ట్రంలో వైసీపీ పాలనలో వారు చేసిన అరాచకమే ఆ పార్టీని తుడిచిపెట్టేలా చేసిందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక సుభాష్‌రోడ్డులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ అరాచకం, విచ్చలవిడిగా డబ్బు పంచిపెట్టిందని, ఎన్నికల కౌంటింగ్‌లో తొలి రౌండ్ నుంచే టీడీపీ మెజారిటీ వచ్చిందని, కాని ఓ పక్క వైసీపీకి ఎక్కడ మెజారిటీ వచ్చేస్తుందో అని భయపడ్డానన్నారు. కానీ ధర్మయుద్ధంలో మదనపల్లె ప్రజలు డబ్బులకు విలువ ఇవ్వకుండా మంచికి, మానవత్వానికి పట్టం కట్టారని తెలిపారు. దేశంలో ఇంత హీనంగా పది శాతం సీట్లు కూడా తెచ్చుకోలేని వైసీపీ, జగన్ పాలనలో విఫలమైందని దీనికి నిదర్శనమే ఇప్పటి ఎన్నికల ఫలితాలన్నారు. ఇంకో 15 ఏళ్లు వైసీపీ రాష్ట్రంలో కనపడదన్నారు. తన గెలుపునకు కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిదున్‌రెడ్డి, దేశాయ్‌తిప్పారెడ్డి, నరేష్‌రెడ్డి, ద్వితీయ శ్రేణి నాయకులు, వార్డు సభ్యులు కలిసి ఒక్కొక్కరు 50 నుంచి 70 దొంగ ఓట్లు వేయించారన్నారు. కానీ ధర్మయుద్ధంలో ప్రజలు తననే గెలిపించారన్నారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు, మాజీ అయినప్పుడు కూడా ప్రజలకు దగ్గరగానే ఉన్నానన్నారు. మదనపల్లెలో చాలా మంది భూకబ్జాలు చేస్తున్నారని, టీకేపల్లెలో ప్లాట్లు అమ్ముకుని కోట్లు దోచుకున్నారని, ఎంపీ, మంత్రి పేర్లు చెప్పుకుని 100 కోట్ల భూములు దోచుకున్నారన్నారు. అలాంటి వారందరికీ హెచ్చరిస్తున్నా ఒక్క అడుగు ప్రభుత్వ భూమి కబ్జా చేసినా, లిటిగెంట్ భూములను దోచుకున్నా వారి భరతం పడతానన్నారు. కట్లాటపల్లె రోడ్డు, బసినికొండ, బైపాస్ రోడ్డు, రింగ్‌రోడ్డు, సీటీఎం, ప్రాంతాల భూకబ్జాలపై దృష్టి పెడతానన్నారు. మదనపల్లెలో గంజాయి, మాదక ద్రవ్యాలు యువతను పెడదోవ పెట్టిస్తున్నాయని, అలాంటి విక్రయదారులు మూడు రోజుల్లో మదనపల్లెను విడిచిపెట్టి పోవాలన్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా మర్యాదగా నడుచుకోవాలని, వారికి సరైన రీతిలో బుద్ధి చెబుతానన్నారు. మదనపల్లె అభివృద్ధికి అన్ని పార్టీలను స్వాగతిస్తున్నానని, అభివృద్ధికి కలసి పనిచేస్తానన్నారు. సమావేశంలో జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, నాదెళ్ల విద్యాసాగర్, శివన్న, ఎస్‌ఏ మస్తాన్, శ్రీనివాసులు, వైశ్యా బ్యాంకు రమణ, ఆర్టిస్ట్ వేణు, బాలుస్వామి, బోయపాటి రామ్మూర్తి, షంషీర్, నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

'ఎవరు గెలిచినా మీదే గెలుపు'

విజేత బి.కోడూరు వాసి!

- ఆంధ్రజ్యోతి కార్యాలయంలో లక్కీడ్రా
- నలుగురు విజేతల ఎంపిక

చెన్నూరు, జూన్ 5: 'శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు?' అనే అంశంపై ఆంధ్రజ్యోతి- నిర్వహించిన లక్కీడ్రాకు పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల నుంచే అంచనాలు వేస్తూ కూపన్లు స్వీకరించింది. ఈ మేరకు వేలాది కూపన్లు వచ్చాయి. కాగా.. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రైల్వేకోడూరు, రాయచోటిలో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. పులివెందుల, బద్వేలు, రాజంపేటలో వైసీపీ గెలిచింది. ఈ మేరకు అంచనా వేస్తూ పంపించిన కూపన్ల నుంచి బుధవారం సాయంత్రం చెన్నూరు రోడ్డులోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. మొదటి విజేతగా బి.కోడూరు మండలం ఐత్రంపేటకు చెందిన చాటకొండు పుల్లయ్య అనే చందాదారుడు ప్రథమ బహుమతి కింద రూ.10వేలు గెలుచుకున్నారు. అలాగే రూ.5వేల చొప్పున మూడు ద్వితీయ బహుమతులను దువ్వూరు టీచర్స్ కాలనీకి చెందిన బండి మహేశ్వరి, రాజంపేట గుత్తా నగర్‌కు చెందిన శ్రీకాంత్‌బాబు తలిపిరెడ్డి, కడపకు చెందిన కొల్లి కృష్ణమూర్తి గెలుచుకున్నారు. విజేతలకు బహుమతిని త్వరలో అందజేస్తారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు అబ్బిగారి నరసయ్య, ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి, సెకండ్ ఇన్‌చార్జి కె.కృష్ణమరాజు, ఏసీఎం కె.రామమోహన్‌రెడ్డి, టెక్నికల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

విజేతల వివరాలు

- రూ.10వేలు గెలుపొందిన మొదటి విజేత..
  - చాటకొండు పుల్లయ్య, 3/81 శివాలయం వీధి, ఐత్రంపేట, బీకోడూరు.
- రూ.5వేల చొప్పున గెలుపొందిన ద్వితీయ విజేతలు

1. బండి మహేశ్వరి, 1/68, టీచర్స్ కాలనీ, దువ్వూరు.
2. శ్రీకాంత్‌బాబు తలిపిరెడ్డి, 5/98-4, గుత్తానగర్, రాజంపేట.
3. కొల్లి కృష్ణమూర్తి, 79/51-12, నారపరెడ్డి విల్లాస్, కడప.



విజేతలను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● కలెక్టరు విజయరామరాజు




మొక్కలు నాటుతున్న కలెక్టర్, విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈవో

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టరు విజయరామరాజు పిలుపునిచ్చారు. బుధవారం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టరు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు ప్రవీణ్‌చంద్, ఆర్డీవో, ప్రిన్సిపాల్ సలీంబాషా, ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ విజయలక్ష్మిదేవి, డాక్టర్ శచీదేవి, డాక్టర్ సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు : కడప నగరం రాయచోటి రోడ్డు మున్సిపల్ పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగర పాలక సంస్థ సహకారంతో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ, సమగ్ర శిక్ష సీఎంవో కేశవరెడ్డి, కార్పొరేషన్ అసిస్టెంటు డైరెక్టరు అనిల్‌కుమార్, రిటైర్డ్ హెచ్‌ఎం బాలయల్లారెడ్డి, వైవీయూ అసిస్టెంటు ప్రొఫెసరు మృత్యుంజయరావు పాల్గొన్నారు.

10,116 టెంకాయలు కొట్టిన తెలుగు తమ్ముళ్లు

● గండి అంజన్నకు ప్రత్యేక పూజలు



గండిలో టెంకాయలు కొడుతున్న టీడీపీ శ్రేణులు

చక్రాయపేట, జూన్ 5: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడంతో గండి వీరాంజనేయస్వామి ఆలయంలో వేంపల్లెకు చెందిన తెలుగు తమ్ముళ్లు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయం సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఎదుట టీడీపీ నేతలు సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 10,116 టెంకాయలను కొట్టారు. మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, యువ నేతలు భరత్‌రెడ్డి, రవితేజరెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, షబ్బీర్, కన్వీనర్ మునిరెడ్డి తదితరులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలందరికీ సంక్షేమం జరగాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఎన్డీయేకి పట్టం కట్టబెట్టారని తెలిపారు. అక్కడకు వచ్చిన కార్యకర్తలంతా టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వల్లి, మడక శ్రీనివాసులు, డక్కా రమేష్, మండల ఉపాధ్యక్షులు భద్ర, పట్టణ అధ్యక్షుడు ఆర్‌పీ రమేష్, నామా వేమకుమార్, మహమ్మద్, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, మాజీ సర్పంచు వీరలింగేశ్వరరెడ్డి, నల్లగారి రామకృష్ణారెడ్డి, గండి మాజీ ఛైర్మన్ రమణ, రెడ్డి కిషోర్, పోతిరెడ్డి శివ, మాజీ దేవస్థాన ఛైర్మన్ ఎద్దల కొండ్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం వేధింపులు భరించలేక

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం



ఆశావర్కర్‌ను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

రాయచోటిటౌన్, జూన్ 5: ఏఎన్ఎం వేధింపులు భరించలేక పాత రాయచోటికి చెందిన ఆశావర్కర్ వెంకటలక్ష్మి (చిట్టెమ్మ) బుధవారం తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కథనం మేరకు... రాయచోటి పట్టణంలోని వాల్మీకి స్ట్రీట్‌లో గల అర్బన్ పీహెచ్‌సీలో వెంకటలక్ష్మి ఆశావర్కర్‌గా పనిచేస్తోంది. ఆమె తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నప్పటికీ అదే పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఏఎన్ఎం వేధింపులు ఎక్కువయ్యాయి. సమస్యను సంబంధిత డాక్టర్‌తో పాటు హెల్త్ సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోగా ఏఎన్ఎంకే వైద్యులు కూడా వత్తాసు పలకడంతో బుధవారం ఆమె తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో కోలుకుంటోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య రాయచోటి ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఆశావర్కర్‌ను పరామర్శించి జరిగిన సంఘటనను విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని చెప్పారు. కాగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి కారకులైన ఏఎన్ఎంతో పాటు సూపర్‌వైజర్‌పై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు విచారణ జరిపించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ఇన్‌చార్జి గంగాధర్ డిమాండ్ చేశారు.

ఆశాను వేధించిన ఏఎన్ఎంను సస్పెండ్ చేయాలి



ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ఆత్మహత్యాయత్నానానికి పాల్పడిన ఆశావర్కర్ చిట్టెమ్మకు న్యాయం చేయాలని ఏరియా ఆసుపత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్.మెహరున్నీషా, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరామాంజులు, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు ఏవీ రమణ మాట్లాడుతూ ఏఎన్ఎం పార్వతీభాయ్ బహిరంగంగా తీవ్ర అసభ్య పదజాలంతో తిట్టిన కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)

ఒంటిమిట్ట, జూన్ 5 : మండల పరిధిలోని కుడుమలూరు గ్రామంలో అప్పుల బాధతో నేతగాని మల్లయ్య (52) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయంతో పాటు కుటుంబ సమస్యలతో సతమతమవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ఫిర్యాదు రావడంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

వరదరాజులరెడ్డికి అభినందనల వెల్లువ




వరదరాజులరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5: తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎన్.వరదరాజులరెడ్డిని తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరి పి.దేవదాసు ఘనంగా సత్కరించారు. బుధవారం ఉదయం కామనూరులో వరదరాజులరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, విజయబాబు, సంజీవకుమార్, కమలమ్మ, జ్యోత్స్న, నిర్మల, శ్రీను, వెంకటసుబ్బయ్య, ముస్కీన్, తదితరులు పాల్గొన్నారు.

ఓల్టాకు తూట్లు..

ధరణిపై పోట్లు



బోర్లలో నీరు రాకపోవడంతో సాగుచేయక వదిలేసిన భూములు

- భూగర్భజలాలు అడుగంటడంతో ఎండిపోతున్న పంటలు
- లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వేస్తున్న బోర్లు
- భారీగా నష్టపోతున్న రైతులు

రాజంపేట, జూన్ 5: వరుణుడి కరుణ లేకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఓల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా బోర్లు వేస్తూ లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. వెయ్యి నుంచి 2 వేల అడుగులు బోర్లు వేసినా నీటి జాడ కనిపించడం లేదని వాపోతున్నారు. రెండున్నర సంవత్సరాలుగా వర్షం కురవకపోవడంతో రాజంపేట ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. 2 వేల అడుగులు బోర్లు వేసినా చుక్క నీరు పడటం లేదు. రెండున్నర సంవత్సరాలుగా వర్షాలు లేకపోవడం, అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి చుక్కనీరు లేకపోవడం వల్ల భూగర్భజలం లేకుండాపోయింది. ఈ సమయంలో సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు లక్షలు ఖర్చు చేసి కొత్తగా బోర్లు వేస్తున్నారు. ఒక్కో బోరుకు లక్ష రూపాయలు పైబడి ఖర్చు చేస్తున్నా భూగర్భజలం రావడం లేదు. ఒక్కో రైతు నాలుగు ఎకరాల పొలంలోనే నాలుగు బోర్లు వేసి నాలుగు లక్షలు ఖర్చు పెట్టుకుంటున్నా ఉపయోగం లేకుండాపోతోంది. ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గడంతో రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కొత్త బోర్లు వేయడం ప్రారంభించారు. ఎక్కడచూసినా బోర్లు వేయడమే కనిపిస్తోంది. దీనివల్ల ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో భూగర్భ జలాలు అడుగంటకుండా అందరికీ తాగునీరు, సాగునీరు అందించే ఉద్దేశ్యంతో ఓల్టా చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం ఉద్దేశ్యం ఏంటంటే ఒక బోరు ఉన్న ప్రాంతం నుంచి 250 మీటర్ల వరకు పరిసర ప్రాంతాలలో ఎవరూ బోర్లు వేయకూడదు. ఒకవేళ ఎవరైనా వేస్తే వారిపై కేసులు నమోదు చేస్తారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోరును సీజ్ చేస్తారు, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, ఎంపీడీవో అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఓల్టా చట్టాన్ని అమలు చేయాలి. ఈ చట్టాన్ని అమలు చేసే అధికారే లేకుండాపోయారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నామమాత్రపు చర్యలు తీసుకుంటూ తిరిగి వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుత కరువు పరిస్థితిలో ఆశకు పోయిన రైతులు తమ పాత బోర్లు ఎండి పోవడంతో కొత్త బోర్లు అధికంగా వేస్తున్నారు. దీనివల్ల ఇప్పటికే వందల కోట్లు నష్టపోతున్నారు. రాష్ట్రమంతా కరువుతో అల్లాడుతున్న ఈ స్థితిలో కనీస జ్ఞానాన్ని పాటించకుండా నీరు రావని తెలిసి కూడా బోర్లను ఇష్టమొచ్చినట్లు వేసి కోట్లు ఖర్చు చేస్తున్నారు. దీనిద్వారా భూగర్భజలం పూర్తిగా ఇంకిపోయింది. రైతులకు చుక్కనీరు రాదు కదా కోట్లు ఖర్చు చేశారు. ఈ విధంగా ఓల్టా చట్టాన్ని తుంగలో తొక్కారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో ఎక్కడ చూసినా బోర్ల శబ్దమే వినవస్తోంది. ఇప్పటికే ఈ రెండు నియోజక వర్గాలలో వందలాది బోర్లు వేశారు. గత ఏడాది వర్షమే లేకపోవడంతో భూగర్భజలాలు 1000 అడుగుల లోతుకు ఇంకిపోవడం, పంటలన్నీ పూర్తిగా ఎండిపోయాయి. దీనివల్ల వందలాది బోర్లు ఎండిపోతున్నాయి. ఒక్కో బోరుకు 1000 అడుగుల నుంచి 1500 అడుగుల వరకు వేస్తున్నారు. ఒక్కో బోరు వేయడానికి లక్ష ఖర్చవుతోంది. ఇలా అనేక మంది రైతులు లక్ష నుంచి 5 లక్షలు పైబడి కేవలం బోర్లు వేసుకోవడానికే ఖర్చు చేస్తున్నారు. అయినా చుక్కనీరు పడటం లేదు. ఈ కొత్త బోర్లు వేయడం వల్ల వాటిలో నీరు రాకపోవడం వల్ల పాత బోర్లు ఎండిపోవడం, వదిలేయడం ఇలా చేయడం వల్ల కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. దానికి తోడు చుక్క నీరు రాకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు చేసి బోర్ల కోసం పెట్టిన ఖర్చులు బూడిదలో పోసిన పన్నీరుగా మారి పంటలన్నీ ఎండిపోతున్నాయి.




భూగర్భజలాలు అడుగంటి ఎండిపోతున్న పంటలు, (ఇన్‌సెట్లో) కొత్త బోర్లు వేస్తున్న రైతులు

కడపలో టీడీపీ జెండా ఎగురవేశాం

● కడపను అన్నివిధాలా అబివృద్ధి చేస్తాం ● ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు .శ్రీనివాసరెడ్డి



ఆర్‌ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 5 : కడప నియోజకవర్గంలో 20 సంవత్సరాల తరువాత టీడీపీ జెండాను ఎగురవేశామని, కడప నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని మాజీ మంత్రి ఆర్.రాజగోపాల్‌రెడ్డి ఘాట్ వద్ద శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కడియాల క్రిష్ణమూర్తి కుమారుడు వెంకటప్రసాదు పేదల కోసం నిర్మిస్తున్న కల్యాణ మండపానికి విరాళం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కడప కోటలు బద్దలు కొట్టామని, గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ ఎంత వేగంగా ఎగిరిపడ్డారో అంతకు మించిన వేగంతో కిందికి దించామన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి 1960 నుంచి లక్కిరెడ్డిపల్లె నుంచి పోటీ చేసి ఎన్నోసార్లు ఘన విజయాలు సాధించి రాష్ట్రంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు. ఉమ్మడి కడప జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలు గెలవడం ఒక ఎత్తు అయితే.. తెలుగుదేశం పార్టీ జెండాను కడప నగరంలో ఎగురవేసి చంద్రబాబునాయుడుకు బహుమతిగా ఇచ్చామన్నారు. గతంలో కడప ఎమ్మెల్యేను గుర్తించడం చాలా తక్కువ. కడప ఎమ్మెల్యే అంటే జగనా అనే వారు, అలాంటి ఎమ్మెల్యేకి ప్రజలు బుద్ధి చెప్పారు. కడప నియోజకవర్గంలో గెలిచింది జగన్ మీద అన్నారు. రాజగోపాల్‌రెడ్డి వారసులుగా ప్రజాసేవ మళ్లీ కొనసాగిస్తామని, ఈ విజయం ఆయనకు అంకితం చేస్తున్నామని తెలిపారు. కడప ప్రజలకు అందుబాటులో ఉండి కడప నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, ఆర్.నాగేంద్రారెడ్డి, ఆర్.విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ అనుంపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు యూత్ ప్రెసిడెంట్ తోపిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, గాలివీడు వెంకటశివారెడ్డి, టీడీపీ కార్యకర్తలు ఆర్‌ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

సచివాలయంపై జగన్ లోగో తొలగింపు



సచివాలయంపై జగన్ లోగోపై పసుపురంగు వేసిన దృశ్యం

పెనగలూరు, జూన్ 5: మండలంలోని ముద్రపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంపైన ముద్రించిన ముఖ్యమంత్రి జగన్ లోగోను గ్రామ ప్రజలు తుడిచి వేశారు. ముద్రపల్లె యువకులు పసుపుపచ్చ రంగు డబ్బా తీసుకువచ్చి గ్రామ సచివాలయంపై ముద్రించిన జగన్ లోగోను పసుపు రంగుతో తుడిచివేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ప్రభుత్వ కార్యాలయాలలో రాజకీయ నాయకుల చిత్రపటాలు, దానికి సంబంధించిన బొమ్మలు, ఇతరత్రా ఏవైనా ఉంటే తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ ముఖ్యమంత్రి జగన్ దెబ్బకు భయపడిన అధికారులు, ఉన్నతాధికారులు సైతం వాటి జోలికి వెళ్లలేదని తెలిపారు. ప్రభుత్వం మారడం వల్ల అయిదేళ్ల ప్రజలకు నరకం చూపించిన జగన్ బొమ్మను చూడటం కూడా పాపమని భావించి ఇలా చేయాల్సి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ లోగోలు, చిత్రపటాలను వెంటనే తొలగించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

రాజోలి నిర్మించి తీరుతాం

● రూ.90 కోట్ల తాగునీటి పథకంపై కలెక్టర్‌తో మాట్లాడా : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు, జూన్ 5 : రాజోలి జలాశయం నిర్మించి తీరుతామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన మొదట సారిగా బుధవారం రాత్రి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై విలేకరులతో మాట్లాడారు. అవినీతి, కమీషన్ల పర్వం అనేదే లేకుండా అభివృద్ధే ధ్యేయంగా పాలన చేస్తానని, తొలిరోజే బృహత్తర ఇంటింటికి తాగునీరు అందించేందుకు దాదాపు 90 కోట్ల నిధులపై కలెక్టర్‌తో మాట్లాడానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేస్తూ అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, సీఎం చంద్రబాబుతో మాట్లాడి రాజోలి జలాశయం, స్టేడియం నిర్మిస్తానన్నారు. అధికారులతో కలసి ప్రతి గ్రామంలో తిరిగి ప్రజా సమస్యలపై బాధ్యత వహిస్తానని తెలిపారు. బృహత్తర తాగునీటి పథకంపైకలెక్టర్ విజయరామరాజుతో మాట్లాడానన్నారు. కాగా కేంద్రంలోనూ ఎన్డీయే కూటమి ఉంది కాబట్టి ప్రత్యేక నిధులు తీసుకవస్తానని, ఎల్లప్పుడూ ప్రజల అభివృద్ధి కోసమే పాటు పడతానన్నారు. కక్ష పూరిత రాజకీయాలు చేయనని పేర్కొన్నారు. కాగా తొలిసారిగా మైదుకూరుకు రావడంతో నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో అభినందించారు. పట్టణంలోని పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లిని పుట్టా సుధాకర్ యాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన తుంగా రమణయ్య



నాదెండ్ల మనోహర్‌ను సన్మానిస్తున్న తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), జూన్ 5: కడప జనసేన నేత తుంగా రమణయ్య బుధవారం సాయంత్రం తెనాలి ఎమ్మెల్యే ఆఫీసులో జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ నాయుడును కలిశారు. దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా జనసేన, టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేల గురించి జిల్లా రాజకీయాల గురించి నాదెండ్ల మనోహర్‌కు వివరించారు. కార్యక్రమంలో తుంగా కిరణ్, గజ్జల సాయి, చార్లెస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రహోమం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం ఆలయ కాలక్షేప మండపంలో గంగ, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కూటమిలో జోష్... వైసీపీలో నైరాశ్యం

- చెల్లాచెదురైన వైసీపీ నేతలు, కార్యకర్తలు
- బోసిపోయిన కోడూరు వైసీపీ కార్యాలయం
- కళకళలాడుతున్న కూటమి కార్యాలయాలు

రైల్వేకోడూరు, జూన్ 5: రాష్ట్రంలో ఊహించని విధంగా కూటమి విజయం సాధించడం, రైల్వేకోడూరులో 2004 నుంచి గెలవని సీటు కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి గెలవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో హుషారు నింపింది. కోడూరులో ఐదోసారి గెలుస్తామని ధీమాగా ఉన్న వైసీపీ ఓటమితో బేజారులో పడిపోయింది. కూటమి దెబ్బకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. కోడూరులో వైసీపీ ఓటమి పాలుకావడం పట్ల ఆ పార్టీ కార్యాలయాన్ని తెరిచే దిక్కు లేకుండా పోయారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కళకళలాడిన పార్టీ కార్యాలయం ప్రస్తుతం బోసి పోయింది. జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల కార్యాలయాలు నాయ కులు, కార్యకర్తలతో కళకళలాడుతున్నాయి. వైసీపీ ఓటమిపై మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు నేతలు బెంగుళూరుకు వెళ్లి పునారా లోచనలో పడినట్లు తెలిసింది. అక్కడే ఎందుకు పునరాలోచన చేయాలి, కోడూరులో ఉండి చేయవచ్చు కదా అని వైసీపీ శ్రేణులు చర్చించుకోవడం కోడూరు హాట్‌టాఫిక్‌గా మారింది. నాలుగు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఓటమిని జీర్ణించు కోలేకపోతున్నారు. కోడూరుకు ఏమి చేయలేకపోయినా దాడులు, దౌర్జన్యాలు, స్మగ్లర్లకు అండదండలు చేయించడం, వైఎస్ జగన్‌పై ఉన్న తీవ్ర వ్యతిరేకతతో ఓడిపోయామని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. కార్యకర్తలను పట్టించుకోకుండా పోవడం, నియోజకవర్గంలో ఆ నలుగురినే పట్టించుకోవడం, వారి చెప్పిందే చేయడం, పలు సామాజిక వర్గాలను విస్మరించడంతోనే కొరముట్ల ఓటమికి కారణమని చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా రైల్వేకోడూరులో కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ గెలవడంతో యువ ఎమ్మెల్యేని కలవడానికి నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు కలసి భారీ ఎత్తున పూలదండలు వేసి అభినందనలు తెలిపారు. ముందస్తు చర్యగా వైసీపీ కార్యాయలం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఉన్నారు. కార్యాలయం గేట్లు కూడా తెరవడానికి ఎవరు రాకపోవడం, కోడూరులో కూటమి దెబ్బకు వైసీపీ ఓటమితో కార్యకర్తలు కనిపించకుండా పోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కోడూరులో వైసీపీ ఓటమితో చాలా మంది నాయకులు షాక్ నుంచి తేరుకోలేదు.


రైల్వేకోడూరు వైసీపీ కార్యాలయం గేటు తెరిచేందుకు రాని దృశ్యం


టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఇంటి వద్ద కోలాహలం

కూటమి విజయం చారిత్రాత్మకం


ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రామాపురం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కూటమి విజయం చారిత్రాత్మకమని రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డిలు అన్నారు. రామాపురంలో మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి స్వగృహంలో బుధవారం వారు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాటాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు మితిమీరి పోయాయని.. ప్రజలు చూస్తూ ఊరుకోరనే దానికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారన్నారు. అనంతరం చిట్లూరు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన గాలివీటి సురేందర్‌రెడ్డిని అయన పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రమేశ్‌రెడ్డి, శివారెడ్డి, సరస్వతిపల్లె మాజీ సర్పంచ్ మున్నీర్‌బాషా, రేఖబ్రదర్స్ చంద్రశేఖర్‌రెడ్డి, కదిరప్పనాయుడు, లోకేశ్ పాల్గొన్నారు.

ఎన్డీఏ గెలుపు చారిత్రాత్మకం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామజగదీశ్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్

సుండుపల్లె, జూన్ 5: కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి అభ్యర్థుల గెలుపు చారిత్రాత్మకం అని బీజేపీ రాజంపేట అసెబ్లీ కన్వీనర్ రామజగదీశ్ తెలిపారు. బుధవారం సుండుపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో అరాచక పాలనకు చరమగీతం పడిందని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించాలని హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలో మరోమారు బీజేపీ అధికారంలోకి రానునందని.. బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. రానున్న రోజుల్లో దేశంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల సారధ్యంలో ప్రజలందరికీ మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రమణ నాయుడు, ఉపాధ్యక్షుడు రెడ్డెయ్యఆచారి, కిసాన్‌మర్చా అధ్యక్షుడు సుబ్బరామ రాజు, సీనియర్ నాయకులు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా విజయం... రుణం తీర్చుకుంటాం


రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌లు

ఓబులవారిపల్లె, జూన్ 5: మాపై నమ్మకంతో ఎన్‌డీఏ కూటమి పార్టీ శాసనసభ అభ్యర్థిగా అరవ శ్రీధర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి వుంటామని టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కృషితో ఈ విజయం సాధించామని.. ఇది ప్రజా విజయమని సంతోషం వ్యక్తం చేశారు. ముక్కావారిపల్లెలో వారి సొంత గృహానికి నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు నియోజకవర్గ ప్రజలను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

రైల్వేకోడూరులో వర్షం


రైల్వేకోడూరు ప్రధాన రహదారి జలమయమైన దృశ్యం

రైల్వేకోడూరు, జూన్ 5: మండలంలో బుధవారం వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారి, రైల్వేస్టేషన్ రూటు, రంగనాయకులపేట, కొత్తబజారు తదితర వీధి రోడ్లు జలమయం అయ్యాయి. దీంతో పాదచారులు పలు ఇక్కట్లు పడ్డారు. కురిసిన వర్షంతో బొప్పాయి, అరటి, మామిడికి అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

రైల్వేకోడూరు, జూన్ 5: సమ్మర్ క్యాంపు సందర్భంగా రైల్వేకోడూరు గ్రంథాలయం లో బుధవారం విద్యార్థిని, విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 7న బహుమతులు పంపిణీ చేస్తామని గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు తెలిపారు.

నీట్‌లో మెరిసిన నేహారెడ్డి



రామాపురం, జూన్ 5: నీట్ యూజీ (ఎంబీబీఎస్) 2024 ఫలితాల్లో మండలం లోని నల్లగుట్టపల్లి గ్రామం కస్పాకు చెందిన బండపల్లి మధుసూదన్‌రెడ్డిల కుమార్తె బండపల్లె నేహారెడ్డి 670 మార్కులు సాధించి ఆలిండియా ఈడబ్ల్యుఎస్ కోటాలో 1651వ ర్యాంక్ సాధించింది. ఈ సంవత్సరం జరిగే ఆల్ ఇండియా కౌన్సిలింగ్ కోటాలో (ఎయిమ్స్ కాలేజీల్లో) సీట్ సంపాదిస్తానని బండపల్లి నేహారెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేసింది.

కూటమి విజయం.. సంబరాల్లో పార్టీ శ్రేణులు



సంబరాలు జరుపుకుంటున్న ఏపీఎండీసీ, మంగంపేట వాసులు, ఈడిగపల్లెలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

ఓబులవారిపల్లె, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి గెలుపుతో మంగంపేటలోని ఏపీఎండీసీ పరిపాలన భవనం ఎదుట కేకును కట్‌చేసి సంబరాలను జరుపుకున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి రాష్ట్రంలో విజయం సాధించడంతో కొన్ని సంవత్సరాలుగా ప్రతిపక్షంలో మగ్గిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆనందంతో ఏపీఎండీసీ పరిపాలన భవనం ఎదుట సీపీవో సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగస్తులు, గ్రామస్థులతో కలిసి సంబరాలను కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మంగంపేట గ్రామ పెద్దలు కల్లా చలపతి, అనమలగుండం చంద్రమోహన్, గునిపాటి చిన్నరాయుడు, గునిపాటికిరణ్, లావలూరి మల్లికార్జున, ఓబయ్య, కొటారు మణి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : పట్టణంలోని గాంధీనగర్‌లో బుధవారం కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కోడూరులో జనసేనపార్టీ అభ్యర్థి విజయం సాధించడం పట్ల గాంధీనగర్‌లో స్వీట్లు పంచి కేకు కత్తిరించి పార్టీ అభిమానులకు పంచి పెట్టారు. కూటమి నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, పఠాన్ మౌలా, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: ఎన్‌డీఏ భారీ విజయాన్ని సాధించిన సందర్భంగా రాజంపేట పార్లమెంటు జనసేన నాయకులు శ్రీనివాసరాజు పార్టీ కార్యాలయంలో బుధవారం స్వీట్లు పంచారు. మైనార్టీ నాయకులు అబూ బకర్, ఎస్కే కరీం, తుపాకుల బాష తదితరుల ఆధ్వర్యంలో నాయకులు స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గాలివీడు : మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి ఎమ్మెల్యేగా గెలవడంతో టీడీపీ నాయకులు వివిధ దేవతా మూర్తులకు మొక్కలు తీర్చుకున్నారు. బుధవారం నూలివీడు పంచాయతీ ఆవుల వాండ్లపల్లెకు చెందిన చిరసాని సురేంద్రరెడ్డి, హరినాధ్‌రెడ్డిలు తమ గ్రామంలోని ప్రజ లను తరిగొండకు తీసుకెళ్లి మొక్కుబడులు చెల్లించుకున్నారు. నూలివీడుకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పొట్లి పార్వతమ్మ గ్రామదేవత రేణుక యల్లమ్మకు 101 టెంకాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వీరబల్లి : రాష్ట్రంలో టీడీపీ విజయదుంధుభి మోగించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆలయాల వద్ద బుధవారం 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వీరబల్లి పంచాయతీలోని ఈడిగపల్లె ఆంజనేయస్వామి ఆలయం వద్ద కార్యకర్తలతో టీడీపీ మండల నాయ కులు టి.శ్రీధర్‌రెడ్డి, రామచంద్ర, భాస్కర్, తుమ్మల రమేశ్ తదితరులు 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. వంగిమళ్ల యల్లమ్మ ఆలయం వద్ద వీరబల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు, టీడీపీ నాయకులు కల్లూరి రామ్మోహన్ టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.

పెనగలూరు : మండలంలోని ఈటమార్పురం గ్రామంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పుచ్చకాయల రవికుమార్, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యంల ఆధ్వర్యంలో బుధవారం కూటమి విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కోడూరు కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్ భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల గ్రామంలోని యువకులు, చిన్నారులతో కలిసి కేకును కట్ చేసి పంచి పెట్టారు.



తరిగొండలో మొక్కుతీర్చుకుంటున్న టీడీపీ నాయకులు, రైల్వేకోడూరులో కేక్ కత్తిరించి అభిమానులకు పంచి పెడుతున్న కూటమి నాయకులు



ఈటిమార్పురంలో విజయోత్సవ సంబరాలు చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలు, శ్రీనివాసులరాజుకు స్వీట్లు తినిపిస్తున్న మైనార్టీ నాయకులు

సంబేపల్లెలో టీడీపీకి పూర్వవైభవం

- 15 సంవత్సరాల తర్వాత టీడీపీ మెజార్టీ

సంబేపల్లె, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల తీర్పు టీడీపీ వైపే అని ఎన్నికల్లో ఓటర్లు తీర్పునిచ్చారు. 15 సంవత్సరాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండల ఓటర్లు తెలుగుదేశం వైపు ఉండేవారు. మండలంలో 1500 నుంచి 4వేల వరకు టీడీపీకి మెజార్టీ వస్తుండేది. ఇక్కడ బీసీ, ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉండడంతో ఓటర్లు టీడీపీ వైపు మొగ్గు చూపేవారు. కానీ 2009లో జరిగిన ఎన్నికల్లో మండల ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన శ్రీకాంత్‌రెడ్డి వైసీపీ తరపున పోటీ చేసిన ఉప ఎన్నికల్లో, 2014, 2019 ఎన్నికల్లో గెలుపొందారు. ఈ గెలుపులో మండల ఓటర్లు మూడు వేల నుంచి 5 వేల వరకు వైసీపీకి మెజార్టీని కట్టబెట్టారు. 2024 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వైసీపీ అభ్యర్థిగా శ్రీకాంత్‌రెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా గట్టి పోటీ ఇచ్చిన రాంప్రసాద్‌రెడ్డి సంబేపల్లెలోను తన సత్తా చాటాడు. మండలంలో 2273 ఓట్లు మెజార్టీ సాధించారు. దీంతో గతంలో టీడీపీ కోల్పోయిన పట్టును తిరిగి సాధించుకున్నట్లు అయ్యింది. 15 సంవత్సరాల తర్వాత టీడీపీకి సంబేపల్లెలో పూర్వ వైభవం రావడంతో టీడీపీ అభిమానుల్లో, కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపినట్లు అయ్యింది.

గ్రామాల వారీగా మెజార్టీ

మండలంలోని 14 గ్రామాలకు 11 గ్రామాల్లో టీడీపీ మెజార్టీ సాధించగా మూడు గ్రామాల్లో మాత్రమే వైసీపీ మెజార్టీ సాధించింది. గ్రామాల వారీగా నారాయణరెడ్డిపల్లెలో టీడీపీ 660 ఓట్ల మెజార్టీ సాధించింది. మోటకట్ల గ్రామంలో 39 ఓట్లు, పీఎస్‌కాలనీలో 81 ఓట్లు మెజార్టీ టీడీపీ సాధించింది. సంబేపల్లెలో 311 ఓట్లు, ఎస్.సోమవరం 203 ఓట్లు, గుట్టపల్లెలో 179 ఓట్లు టీడీపీ మెజార్టీ సాధించింది. శెట్టిపల్లిలో 699 ఓట్లు, గురిగింజకుంటలో 44 ఓట్లు, దుద్యాలలో 173 ఓట్లు, దేవపట్ల గ్రామంలో 154 ఓట్లు, రెడ్డివారిపల్లె 327 ఓట్ల టీడీపీ మెజార్టీ సాధించింది. రౌతుకుంట గ్రామంలో 141 ఓట్లు, నాగిరెడ్డిగారిపల్లెలో 253 ఓట్లు, గున్నికుంట్ల గ్రామంలో 193 ఓట్లు వైసీపీకి మెజార్టీ వచ్చాయి. రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం చివరి 21వ రౌండ్ అయిన సంబేపల్లె ఫలితం వచ్చేంత వరకు ఉత్కంఠ భరితంగా సాగింది. సంబేపల్లె మెజార్టీతో టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి విజయం ఖరారు అయ్యింది.

వ్యాధి నిరోధక టీకాలపై తనిఖీ


టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి కొండయ్య

సంబేపల్లె, జూన్ 5: మండల పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లె సచివాలయం, దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పిల్లలకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాలను బుధవారం జిల్లా వైద్యాధికారి కొండయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అన్ని గ్రామాల్లోని ప్రతి పిల్లవాడిని గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వస్తోందని సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. గ్రామాల్లోని ఇండ్ల సమీపాల్లో పేడదిబ్బలు, మురికిగుంటలు, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, హెల్త్‌అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్‌యం భాగ్య, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి


లక్కిరెడ్డిపల్లె అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న సీడీపీవో పద్మావతి

లక్కిరెడ్డిపల్లె, జూన్ 5: లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్ వాడీ సెంటర్‌లో అంగన్వాడీ వర్కర్లు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపా డాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా లక్కిరెడ్డిపల్లె-1 అంగన్వాడీ సెంటర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటే వర్షాలు కురిసి ప్రకృతి చల్లగా ఉంటుందని, కరువును అరికట్టవచ్చున్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పెరటిలో కూరగాయాలు, ఆకుకూరలు సాగుచేసి పిల్లలకు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలి


కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

సిద్దవటం, జూన్ 5: ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ మునిరత్నం అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దవటం కోర్టు ప్రాంగణంలో అటవీశాఖ సిబ్బంది, కోర్టు సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అలాగే అటవీ ప్రాంతంలో చెట్లను అందరించాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతికి సహకరించాలని, కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని సూచించారు.

జగన్ నిరంకుశ పాలనకు చరమగీతం

రైల్వేకోడూరు, జూన్ 5: రాష్ట్రంలో జగన్ నిరంకుశ పాలనకు ప్రజా తీర్పు ద్వారా చరమగీతం పాడారని సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్యలు తెలిపారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఫలితాల్లో జగన్ నిరంకుశ, దౌర్జన్యం, అరాచక పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రతిపక్షాలపై వేధింపులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడిన జగన్‌ను పాతాళానికి తొక్కేశారన్నారు. డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ ఒకరికి గాయాలు

రాయచోటి టౌన్, జూన్ 5: రాయచోటి మండల పరిధిలోని యండపల్లె గ్రామంలో వైసీపీ వర్గీయులు చేసిన దాడికి టీడీపీ వర్గీయులు ప్రతి దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు... మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల్లో రాయచోటి టీడీపీ అభ్యర్థిగా మండపల్లె రాంప్రసాద్‌రెడ్డి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మాధవరం గ్రామంలో సైకం శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన విందుకు రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో యండపల్లె గ్రామం బోయపల్లె వద్ద రాంప్రసాద్‌రెడ్డి అభిమాని, రెండు రాష్ట్రాల డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధార్థగౌడ్ బాణాసంచా కాల్చి స్వాగతం పలికారు. అక్కడ నుంచి రాంప్రాద్‌రెడ్డి వెళ్లిపోయిన తర్వాత మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి అనుచరులు కొంత మంది మద్యం మత్తులో సైకం శ్రీనివాసులరెడ్డి వాహనంపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఇదే వాహనంలో రాంప్రసాద్‌రెడ్డి కొడుకు కూడా ఉన్నాడు. ఈ దాడిలో వాహనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. వైసీపీ నాయకుల దౌర్జన్యాన్ని అడ్డుకున్న సిద్ధార్థగౌడ్ సోదరుడు శివశంకర్ గౌడ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అతన్ని వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు. తమ వర్గీయులపై వైసీపీ నాయకులు దాడి చేశారన్న సమాచారం తెలుసుకుని మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి బోయపల్లెకు వచ్చాడు. దీంతో టీడీపీ వర్గీయులు తమ నాయకులపై దాడి చేయడాన్ని జీర్ణించుకోలేక మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి ఇంటిపై దాడి చేసి, ఇంటిని , కారును ధ్వంసం చేశారు. మరికొందరు వైసీపీ వర్గీయులపై దాడి చేశారు. ఈ సమాచారం అందుకున్న అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐలు భక్తవత్సలం, లోకేష్‌లు సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

నామినేటెడ్ పదవులకు పలువురి రాజీనామా

మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన సురేష్


బుల్లెట్ సురేష్

చిత్తూరు, జూన్ 5: టీడీపీ కూటమి ఘన విజయం.. వైసీపీ అధికారం కోల్పోవడంతో పలువురు నేతలు తమ నామినేటెడ్ పదవులకు బుధవారం రాజీనామాలు చేశారు. చిత్తూరుకు చెందిన బుల్లెట్ సురేష్ ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి.. ఆ పత్రాన్ని బీసీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపారు. ఈయన రెండేళ్ల కాలపరిమితి ముగిసినా.. మళ్లీ మరో రెండేళ్లు పొడిగించారు.

పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి..


రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న హేమంత్‌కుమార్‌రెడ్డి

పలమనేరు: పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి హేమంత్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను మార్కెట్ కమిటి కార్యదర్శి సంజీవకుమార్‌కు అందజేశారు. 2019 ఎన్నికలకు ముందు పలమనేరు మార్కెట్ కమిటి చైర్మన్‌గా హేమంత్‌కుమార్‌రెడ్డి అప్పట్లో ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన జగన్ సమక్షంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. 2022 జూన్ 27న హేమంత్‌కుమార్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వైసీపీ ప్రభుత్వం నియమించింది. ఏడాది తర్వాత రెండుసార్లు ఆయన పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఆ పదవీ కాలం కూడా ఈనెల 26న ముగియనుంది. ఈ క్రమంలో వైసీపీ అధికారం కోల్పోవడంతో 20 రోజులు ముందుగానే ఆయన రాజీనామా చేశారు.

గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి..


మేలిపాటి పురుషోత్తం

వెదురుకుప్పం: వైసీపీ అధికారం కోల్పోవడంతో గాండ్ల, తెలికుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు మేలిపాటి పురుషోత్తం బుధవారం తెలిపారు. తన రాజీనామా లేఖను ఏపీ చీఫ్ సెక్రటరీ, బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటుకు పంపినట్లు చెప్పారు.

ద్రావిడ వర్సిటీ రెక్టార్ రాజీనామా


ఆచార్య అనురాధ

గుడుపల్లె: ద్రావిడ విశ్వవిద్యాలయం రెక్టార్ అనురాధ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన ఆమె రాజీనామా పత్రాన్ని వీసీ ఆచార్య మధుజ్యోతికి అందజేశారు. కంప్యూటర్ సైన్స్ శాఖలో ఆచార్యులుగా పనిచేస్తున్న అనురాధ 2022లో రెక్టార్‌గా నియమితులయ్యారు. అంతకు ముందు ఆమె రిజిస్ట్రార్‌గా, ఇన్‌చార్జ్ వీసీగా కూడా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోడంతో ఆమె తన పదవికి రాజీనామా సమర్పించినట్లు తెలిసింది. కాగా, ఈమె రాజీనామాను వీసీ ఆమోదించలేదు.

రుయాస్పత్రికి ప్రత్యేక అడ్మిన్

మే 20న బాధ్యతలు స్వీకరించిన కనక నరసారెడ్డి



తిరుపతి (వైద్యం), జూన్ 5: ఎస్వీ వైద్య కళాశాల (ఎస్వీఎంసీ)తో పాటు దానికి అనుబంధంగా ఉన్న రుయాస్పత్రికి ప్రత్యేక అడ్మినిస్ట్రేటర్ పోస్టును సృష్టించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వైసీపీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా మార్చి 10న జీవో విడుదల చేసింది. తిరుపతి ఆర్డీవోగా పనిచేసిన కనకనరసారెడ్డిని రుయా అడ్మిన్‌గా నియమించినట్టు ఉత్తర్వులో పేర్కొంది. ఆ మేరకు గత నెల 20న వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఎన్నికల క్రతువు ముగిసిన అనంతరం బుధవారం రుయా అధికారులను కలిశారు. గతంలో ఆస్పత్రి వర్కింగ్ చైర్మన్‌కు కేటాయించిన ఛాంబర్‌ను ఏర్పాటుచేసే పనిలో యంత్రాంగం ఉంది. స్విమ్స్, బర్డ్ ఆస్పత్రులపై టీటీడీ జేఈవో పర్యవేక్షణ ఉన్నట్టు రుయా, ఎస్వీఎంసీ పరిపాలనా బాధ్యతలను ఐఏఎస్ స్థాయి అధికారికి అప్పగించాలని వైసీపీ ప్రభుత్వం భావించింది. ఇందుకు వైద్యకళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ స్థాయిలో ఉన్న అధికారులు విముఖత చూపుతుండటంతో ఇది వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఎన్నికల ముందు తీసుకున్న నిర్ణయం కొనసాగుతుందా? లేదా రద్దవుతుందా? అన్న చర్చ జరుగుతోంది.

సత్యవేడు సెంటిమెంట్ పదిలం

● ఇక్కడ గెలిచే పార్టీదే అధికారం

సత్యవేడు, జూన్ 5: సత్యవేడులో గెలిచే పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపడుతుందన్న సెంటిమెంట్ ఈ ఎన్నికల్లో కూడా కొనసాగింది. ఉమ్మడి ఏపీలో టీడీపీ ఆవిర్భావం తరువాత 2009 ఎన్నికల్లో మినహా అన్ని ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపడుతూ వస్తోంది. ఇందుకు నిదర్శనంగా 1983లో టీడీపీ అభ్యర్థి తలారి మనోహర్ గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టింది. 1985లో మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎం.సురాజ్ గెలుపొందగా టీడీపీదే అధికారం, 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సి.దాసు గెలుపొందగా ఆ పార్టీ అధికారం చేపట్టింది, 1994లో టీడీపీ అభ్యర్థి ఎం.సురాజ్ గెలుపొందగా టీడీపీ అధికారంలోకి వచ్చింది, 1999లో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ గెలుపొందగా టీడీపీ అధికారం కొనసాగింది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామి గెలుపొందగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2009లో మాత్రం టీడీపీ అభ్యర్థి హేమలత గెలుపొందగా కాంగ్రెస్ పార్టీయే అధికారం చేపట్టింది. 2014లో విభజిత ఏపీలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య గెలుపొందగా ఆ పార్టీ అధికారం చేపట్టింది. 2019లో వైసీపీ అభ్యర్థి ఆదిమూలం గెలుపొందగా వైసీపీ అధికారం చేపట్టింది. ప్రస్తుత ఎన్నికల్లో ఆయనే టీడీపీ తరపున గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేపడుతుండడం విశేషం.

కుప్పంలో అన్ని శాఖలపై విచారణ

అన్ని దాడులకూ వడ్డీ సహా చెల్లిస్తాం ● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్పష్టీకరణ


టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూన్ 5: కుప్పంలో అవినీతిమయమైన అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల్లో విచారణ తప్పదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఈ ఐదేళ్లు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడినవారిపై కచ్చితంగా వడ్డీ సహా బదులు చెల్లిస్తామని హెచ్చరించారు. కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ నాయకులు గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, పి.మనోహర్, రాజ్‌కుమార్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడికి ఘన విజయాన్ని అందించిన కుప్పం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కుప్పం రెస్కోలో జరిగిన అవకతవకలపై సీఐడీ విచారణ చేపడతామన్నారు. రెస్కో ఎండీ ప్రభాకర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కుప్పం మున్సిపాలిటీలోనూ అనేక అవకతవకలు జరిగాయని, ఇక్కడా త్వరలోనే విచారణ జరిపించి అవినీతిని బయట పెడతామన్నారు.ఈ రెండు సంస్థలే కాక, నియోజకవర్గ పరిధిలో ఆయా శాఖల్లో జరిగిన అవినీతి చర్యలు, అక్రమాలపై కచ్చితంగా విచారణలు జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు వైసీపీ అరాచకాలకు, దాడులకు ఇబ్బందులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలకు కూడా దూరంగా అజ్ఞాతంలో బతకాల్సిన దుర్భర పరిస్థితులు వైసీపీ పాలనలో ఎదురయ్యాన్నారు. తమ పార్టీ శ్రేణుల జోలికి వస్తే ఎలా ఉంటుందో ఇక వైసీపీ మూకలు చూస్తాయన్నారు. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని బీరాలు పలికి నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఓడిపోతే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరినా, వైసీపీ ఎమ్మెల్సీ భరత్ ఆ సవాల్‌ను స్వీకరించలేదని గుర్తుచేశారు. కుప్పంలో ఇన్నాళ్ల అరాచకాలకు, తన ఓటమికి బాధ్యత వహిస్తూ ఎమ్మెల్సీ పదవికి భరత్ రాజీనామా చేసి, ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో మ్యానిఫెస్టోలోని అన్ని హామీలను అమలు పరుస్తామని హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ, చంద్రబాబు ఎప్పుడూ కట్టుబడి ఉంటారని, రాబోయే రోజుల్లో ఇక్కడి ప్రజల పట్ల ఆయన నిబద్ధత ఏమిటో అందరూ చూస్తారని కంచర్ల స్పష్టం చేశారు.

చిత్తూరు రికార్డ్ : దగ్గుమళ్ల మెజార్టీ

● 2.20 లక్షల ఓట్ల ఆధిక్యంతో గెలిచిన టీడీపీ అభ్యర్థి


దగ్గుమళ్లను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

చిత్తూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు భారీ ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. చిత్తూరు పార్లమెంటు చరిత్రలో ఈ స్థాయి మెజార్టీ గతంలో ఎవరికీ రాలేదు. దీంతో దగ్గుమళ్ల రికార్డు సృష్టించినట్లయింది. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన ఐఆర్ఎస్ అధికారిగా ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంటులో దేశంలోని అనేక రాష్ట్రాల్లో పనిచేశారు. చంద్రబాబు పట్ల ఆకర్షితులై ముందస్తు పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన బాపట్ల ఎంపీ స్థానాన్ని ఆశించినా, చంద్రబాబు ఆయన్ను చిత్తూరు ఎంపీ స్థానానికి పంపించారు. ఆయన చిత్తూరుకు రాగానే పార్లమెంటు పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్లారు. తక్కువ సమయంలోనే ప్రచారంలో దూసుకుపోయారు. ఐదేళ్ల పాటు ఎంపీగా పనిచేసిన రెడ్డెప్ప రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డికి అనుచరుడిగా, ఇంట్లో పనిషిగా ఉన్నారే తప్ప ఎన్నడూ తన మార్కుచూపించలేదు. దగ్గుమళ్ల మాత్రం తక్కువ సమయంలోనే డమ్మీ అభ్యర్థిగా కాకుండా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తద్వారా ఓటర్లను ఆకట్టుకున్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఓట్లను 21 రౌండ్లలో లెక్కించగా.. ప్రతిసారీ టీడీపీకే మెజార్టీ వచ్చింది. ఒక్కో రౌండులో సగటున ఆయనకు 10 వేలకుపైగా మెజార్టీ దక్కింది. ఆరో రౌండ్‌లో అత్యధికంగా 17 వేలు, పదో రౌండులో 14851 ఓట్లు వచ్చాయి. మొత్తంగా ఆయనకు 2,20,479 ఓట్ల మెజార్టీ దక్కింది. దీంతో బుధవారం పార్టీ శ్రేణులు, అభిమానులు చిత్తూరులోని ఆయన కార్యాలయంలో అభినందనలు తెలిపి సన్మానించారు.

ఊహించని మెజార్టీ ఇది

చిత్తూరు ఎంపీగా ఎన్నికైన దగ్గుమళ్ల ప్రసాదరావు బుధవారం చిత్తూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు ప్రోత్సాహం, ప్రజల ఆశీస్సులే, పార్టీ శ్రేణుల సహకారంతోనే గెలిచాను. ఈ స్థాయిలో మెజార్టీ వస్తుందని అనుకోలేదు. ఇచ్చిన హామీలకు కట్టుబడి చిత్తశుద్ధితో పనిచేస్తాను. నాకు ఇంత భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు, కార్యకర్తలకు రుణపడి ఉంటాను'అని పేర్కొన్నారు.

సాధించాను ... నాన్నా!



ముద్దుకృష్ణమ రాజకీయ వారసత్వాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముందుకు తీసుకెళుతున్నారు.మంగళవారం రాత్రి నగరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే డిక్లరేషన్ అందుకున్న భానుప్రకాష్ కుటుంబసభ్యులతో కలిసి రామచంద్రాపురం మండల పరిధిలోని వెంకట్రామాపురం చేరుకున్నారు.తన తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడికి సమాధి వద్ద ఘన నివాళి అర్పించడంతో పాటు డిక్లరేషన్‌ను సమాధిపై ఉంచి కొద్ది సేపు ప్రార్థనలు చేశారు.నామినేషన్ దాఖలుకు ముందు కూడా ఆయన తండ్రి సమాధి వద్ద పత్రాలను కాసేపు ఉంచి ఆర్వో కార్యాలయానికి బయల్దేరిన విషయం తెలిసిందే.

-పుత్తూరు అర్బన్

పుంగనూరులో టీడీపీ కార్యకర్తపై దాడి

● బుల్లెట్‌తో ఢీకొట్టి చంపబోయిన వైసీపీ కార్యకర్త


టీడీపీ కార్యకర్త షామీర్‌ను వెనుకనుంచి బుల్లెట్‌తో ఢీ కొడుతున్న వైసీపీ కార్యకర్త ఇమ్రాన్ (నల్లషర్టు వ్యక్తి)

పుంగనూరు, జూన్ 5: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ఘనవిజయాన్ని జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్త పుంగనూరులో ఆ పార్టీ కార్యకర్తపై దాడి చేశాడు. బుల్లెట్‌తో ఢీకొట్టి హతమార్చబోయాడు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు ఉబేదుల్లా కాంపౌండ్‌లో కాపురమున్న షేక్ షామీర్, సయ్యద్ అలియాస్ జంగిల్ చురుకైన టీడీపీ కార్యకర్తలు. సయ్యద్ కౌంటింగ్‌సెంటర్‌లో టీడీపీ ఏజెంట్‌గా ఉండగా అతడి స్నేహితులకు రాతిమసీదు వీధిలో కాపురం ఉన్న ఎస్.నజీర్ కుమారుడు వైసీపీ కార్యకర్త ఎస్.ఇర్ఫాన్ ఫోన్‌లో వార్నింగ్ ఇచ్చాడు. బుధవారం ఉదయం టీడీపీ కార్యకర్త షామీర్ ఈవిషయంపై విచారించడానికి ఇమ్రాన్ ఇంటివద్దకు వెళ్లారు. ఇతడిపై వైసీపీ కార్యకర్త ఇమ్రాన్ మరికొందరు దాడి చేసి చొక్కా చింపి కొట్టారు. ఇందిరాసర్కిల్‌లో కొత్తయిండ్లుకు చెందిన నాగరాజ, దూళ్లవాండ్లఇండ్లుకు చెందిన రాఘవతో షామీర్ మాట్లాడుతున్నారు. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలు ఇర్ఫాన్, అష్రఫ్ బుల్లెట్ (ద్విచక్రవాహనం)లో వేగంగా వచ్చి వెనుకవైపు నుంచి అతడిని ఢీకొట్టారు. దీంతో కిందపడిపోయిన తనను స్నేహితులు పైకిలేపి అడ్డు రావడంతో.. వారినీ ఇమ్రాన్ దుర్భాషలాడి దాడి చేశాడని షామీర్ తెలిపారు. రాఘవను కులం పేరుతో దూషించినట్లు చెప్పారు. తనను అసభ్యకరంగా బూతులు తిడుతూ దాడి చేసి బుల్లెట్‌తో ఢీ కొట్టి హతమార్చాలని ప్రయత్నించిన వైసీపీ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

అసభ్య పదజాలంలో వైసీపీ కార్యకర్తల పోస్టులు

● ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తను అంతుచూస్తామని హెచ్చరిక

రామకుప్పం, జూన్ 5: మండలంలోని 89పెద్దూరు పంచాయతీ ననియాలకు చెందిన వైసీపీ కార్యకర్త కమలనాథ్ మంగళవారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబుపై అసభ్యపదజాలంతో వ్యాఖ్యలు చేస్తూ తన వాట్సాప్ స్టేటస్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిపై స్థానిక టీడీపీ కార్యకర్త రాజశేఖర్ బుధవారం ఉదయం కమలనాథ్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా తనను కులం పేరుతో దూషిస్తూ, అంతు చూస్తానని కమలనాథ్ హెచ్చరించినట్లు బాధితుడు తెలిపారు. అంతేకాకుండా కమలనాథ్ తల్లి రమణమ్మకు ఫోన్ చేయగా ఆమె కూడా కులం పేరుతో దూషించినట్లు చెప్పారు. కమలనాథ్, అతడి తల్లిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు రాజశేఖర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


ఆత్మహత్యకు పాల్పడిన త్రివేణి

పుంగనూరు రూరల్, జూన్ 5: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన బుధవారం పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు... పెద్దపంజాణి మండలం ముత్తుకూరు పంచాయతీ పోలేపల్లెకు చెందిన త్రివేణి(26)కి, పుంగనూరు మండలం నెక్కుంది గ్రామానికి చెందిన నరేశ్(31)తో ఆరు నెలల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు బెంగళూరులో పని చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మంగళవారం ఉదయం ఇద్దరూ నెక్కుందికి చేరుకున్నారు. తాను మరణిస్తున్నట్లు నరేశ్ లెటర్ రాసి ఇంట్లోని టీవీ వెనుక పెట్టి స్నేహితుడికి సమాచారం ఇచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మళ్లీ సాయంత్రం 4గంటల సమయంలో తాను క్షేమంగా ఉన్నట్లు సెల్‌ఫోన్ నుంచి సమాచారం ఇచ్చారు. అయితే బుధవారం తెల్లవారగానే ఇంటిలో త్రివేణి కనిపించకపోగా చుట్టుపక్కల వెతికారు. గ్రామ సమీపంలోని పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని ఉన్న ఆమెను స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. వెంటనే ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు పోలీసులకు తెలిపారు. త్రివేణి ఆత్మహత్య చేసుకుందా, అనుమానాస్పదంగా మృతి చెందిన విషయాన్ని పోలీసులు ఛేదించాల్సింది.

22 మండలాల్లో వర్షం


చిత్తూరు నగరంలో కురుస్తున్న వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5: జిల్లా వ్యాప్తంగా అల్పపీడన ప్రభావంతో గడిచిన 24 గంటల్లో 22 మండలాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. గంగాధరనెల్లూరులో 38.2మి.మీ., నగరి 34.8, కార్వేటినగరం 34.2, బంగారుపాళ్యం 32.0, తవణంపల్లె 26.4, శ్రీరంగరాజపురం 23.6, చిత్తూరు అర్బన్ 23.0, బైరెడ్డిపల్లి 19.4, చిత్తూరు రూరల్ 15.0, నింద్ర 11.6, సదుం 11.2, రామకుప్పం 9.8, పెద్దపంజాణి 8.6, గంగవరం 8.6, శాంతిపురం 8.2, పలమనేరు 7.2, పూతలపట్టు 7.0, ఐరాల 6.2, యాదమరి 3.6, వెదురుకుప్పం 3.4, పుంగనూరు 1.4, వి.కోటలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. .

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.14 కోట్లు

తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.14 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి, బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 76,291 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,495 మంది తలనీలాలు సమర్పించారు.

బాలాంజనేయస్వామికి శాస్త్రోక్తంగా సింధూరార్చన



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంజనేయస్వామి జన్మస్థలమైన ఆకాశగంగలో అంజనాదేవి సమేత బాలాంజనేయస్వామికి బుధవారం ఉదయం సింధూరార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తికి, బాలాంజనేయ స్వామివారికి పుష్ప, తులసి అర్చన జరిగింది. టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు సింధూరం ధరించిన వారికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, కీర్తి గడిస్తారని, సింధూరార్చన విశిష్టత, హనుమత్ వైభవం, అంజనాద్రి పర్వతం గురించి వివరించారు. అనంతరం బాలాంజనేయ స్వామికి, సుదర్శన చక్రానికి పంచామృత స్నపన తిరుమంజనాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గురుమూర్తి ఎలా గెలిచారంటే..!

కూటమి నుంచి క్రాస్ ఓటింగే వరప్రసాద్ కొంప ముంచింది

తిరుపతి ఎంపీ ఫలితంపై జోరుగా చర్చలు


వరప్రసాద్


గురుమూర్తి

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులే ఘన విజయం సాధించినా కూటమి భాగస్వామి అయిన బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ ఓడిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏడు అసెంబ్లీ స్థానాల్లోని అసెంబ్లీ అభ్యర్థులకూ, ఎంపీ అభ్యర్థికీ పడిన ఓట్ల తేడాను పరిశీలిస్తే క్రాస్ ఓటింగ్ జరిగిందనేది స్పష్టమవుతోంది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులందరి ఆధిక్యత కలిపి 1.90 లక్షలు కాగా ఇంచుమించు అంతే ఆధిక్యతతో గెలవాల్సిన కూటమి (బీజేపీ) ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు 14వేలకు పైగా తేడాతో ఓటమిపాలయ్యారు.ఈ ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థుల కంటే ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులకు వచ్చిన మొత్తం ఓట్లు 7.40 లక్షలు కాగా ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావుకు మాత్రం 6.08 లక్షలు మాత్రమే వచ్చాయి. అంటే 1.32 లక్షల ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చూస్తే గూడూరులో ఎమ్మెల్యే అభ్యర్థి కంటే 24,996 ఓట్లు, సూళ్ళూరుపేటలో 20,575 ఓట్లు, సర్వేపల్లిలో 20,396 ఓట్లు, సత్యవేడులో 19,540 ఓట్లు, శ్రీకాళహస్తిలో 18,100 ఓట్లు, వెంకటగిరిలో 17,390 ఓట్లు, తిరుపతిలో 11,421 ఓట్లు చొప్పున ఎంపీ అభ్యర్థికి తక్కువగా వచ్చాయి. గత ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యేగా వైసీపీ నుంచీ గెలిచిన వరప్రసాదరావు తాజా ఎన్నికల్లో నోటిఫికేషన్ సమయంలో బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ టికెట్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. అందువల్ల కూటమి శ్రేణుల్లో లోలోపల అసంతృప్తి రగిలిన ఫలితంగానే క్రాస్ ఓటింగ్ జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనం కొనసాగి 21 ఎంపీ స్థానాలు గెలుచుకున్నా చేజేతులా మరొక ఎంపీ సీటు పోగొట్టుకున్నామన్న వేదన కూటమి వర్గాల్లో వ్యక్తమవుతోంది.

స్థానం	చెల్లిన ఈవీఎం ఓట్లు	వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఓట్లు	వైసీపీ ఎంపీ అభ్యర్థి ఓట్లు	ఎంపీ అభ్యర్థికి అదనపు ఓట్లు	కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఓట్లు	కూటమి ఎంపీ అభ్యర్థి ఓట్లు	ఎంపీ అభ్యర్థికి తగ్గిన ఓట్లు
గూడూరు	192117	80929	96690	15,761	100844	75848	24996
సర్వేపల్లి	193913	86249	96754	10,505	102243	81847	20396
సత్యవేడు	183150	81311	94417	13,106	84626	65086	19540
శ్రీకాళహస్తి	206536	77575	88347	10,772	119554	101454	18100
సూళ్ళూరుపేట	201186	81362	90252	8,890	109724	89149	20575
తిరుపతి	189502	60950	63727	2,777	121205	109784	11421
వెంకటగిరి	196991	87262	96515	9,253	102716	85326	17390
మొత్తం	13,63,395	5,55,638	626702	71,064	7,40,912	608494	1,32,418

నేడు ఆర్‌ఎస్‌ఎస్ సార్వజనికోత్సవం

మదనపల్లె అర్బన్, జూన్ 5: మదనపల్లెమండలం, పోతబోలు గ్రామంలోని శ్రీవేద పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో సార్వజనికోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘచాలక్ బొంతల పార్థసారధి తెలిపారు. హిందూ సమాజ సంఘటనా కార్యంలో సంఘం వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన కార్యకర్తలకు వివిధ విషయాల్లో నిష్ణాతులతో మార్గదర్శకం చేయిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5.30 గంటలనుంచి రాత్రి 7 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

నారా లోకేశ్‌కు మనోజ్ జయంత్‌రెడ్డి శుభాకాంక్షలు



నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మనోజ్ జయంత్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం జూన్ 5 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ యువనాయకుడు మనోజ్ జయంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని ఆయనను కోరినట్లు వివరించారు.

గుర్రంకొండలో పోలీసుల కవాతు

గుర్రంకొండ, జూన్ 5: ఎన్నికల అనంతరం ఘర్షణలు నివారించడంలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండు,బజారువీధి గుండా కవాతు సాగింది.ఎవరైనా గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లి అర్బన్ జూన్ 5 : కుటుంబ సమస్యల కారణంగా ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు . తాలూకా సిఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కోటవారిపల్లె తాండాకు చెందిన చిన్నరెడ్డెప్పనాయక్ కుమారుడు కృష్ణనాయక్ (35) ఆర్థిక పరిస్థితుల కారణంగా జీవితంపై విరక్తి చెందాడు. భార్య అమ్మూ కూలి పనులకు వెళ్లిన సమయంలో తన ఇంట్లోనే చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమె భర్త చనిపోయి ఉండడంతో బోరున విలపించింది. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించి , కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు .

చికిత్స పొందుతూ బాలిక మృతి

మదనపల్లె టౌన్, జూన్ 5: రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందింది. రామసముద్రం మండలం ఓబుల వారిపల్లెకు చెందిన రెడ్డెప్ప తన కుటుంబసభ్యులతో ఈనెల 3న 150 మైలు గ్రామానికి వెళ్లారు. అక్కడ ఆటో దిగి రోడ్డు దాటుతుండగా కర్ణాటకకు చెందిన గంగరాజు, దామోదర్ ద్విచక్రవాహనంలో వస్తూ రోహిత (10)ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడగా, రోహిత పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా బుధవారం రోహిత మృతి చెందింది. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రుద్రాభిషేకం

మదనపల్లె అర్బన్, జూన్ 5: స్థానిక మడికయ్యల శివాలంలో యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు. గురువారం అమావాస్య సందర్భంగా పంచ గ్రహాల కూటమి ఏర్పడుతుందని, ఈ సందర్భంగా నవగ్రహ, నక్షత్ర ఆయుష్యహోమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలు భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌ఎస్‌కు విద్యార్థుల ఎంపిక

మదనపల్లె అర్బన్, జూన్ 5: నేషనల్ మీన్స్ అండ్ మెరిట్స్ స్కాలర్‌షిప్‌కు స్థానిక నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 24 మంది ఎంపికైన ట్లు హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ తెలిపారు. కె.సాయి సాహితి, ఆదివిష్ణు, రియాజ్, లోకేష్‌కుమార్, హరిష్‌కుమార్, గీతా, సంతోష్, వైష్ణవి, చైతన్య, రాజేష్‌రెడ్డి, జితేష్, కవిత, తన్మయ, తస్‌మీయా, రెడ్డిత్రివేణి, దేవేంద్రకుమార్, వికాస్, గోవర్ధన్ సాయి, రాగిణి, కీర్తన, హేమచంద్ర, ఖాజావల్లి, మహ్మద్ ఉమ్మర్, యాస్మిన్ ఎంపిక కాగా, ఇందులో కె.సాయి సాహితి 131 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇంతమంది విద్యార్థులు ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు మునిరాజాకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

కలకడ:నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మలాంషావలి తెలిపారు. గత విద్యా సంవత్సరం 8వ తరగతి చదివిన విద్యార్థులు దైవిక్‌రెడ్డి, సనాసౌమ్య, మహీధర్‌సాయి, ఆరీఫుల్లాకు ఏడాదికి రూ.12 వేలు వంతున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పెద్దతిప్పసముద్రం: పీటీఎం ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరం 8వ తరగతి చదివిన ఇందుకూరి దీరజ్ అనే విద్యార్థి ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఎంఈవో నారాయణ, ప్రిన్సిపాల్ ఎస్ శివకుమారి తెలిపారు. ధీరజ్ స్థానిక పీటీఎం సమీపంలోని జోగివారి పల్లెకు చెందిన విద్యార్థిఅని వారు తెలిపారు.

విజ్ఞతతో ఓటరు విస్పష్ట తీర్పు

● ప్రతి మండలంలోనూ టీడీపీదే ఆధిక్యత ● అత్యధికంగా పీలేరులో 7925, అత్యల్పంగా వాల్మీకిపురంలో 1750 ఓట్ల ఆధిక్యం

పీలేరు, జూన్ 5: ఎన్నికల్లో పీలేరు నియోజకవర్గ ప్రజలు విజ్ఞతతో విస్పష్టమైన తీర్పునిచ్చారు. ఆ తీర్పు మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ప్రతిఫలించింది. నియోజకవర్గంలోని గుర్రంకొండ, కలకడ, కేవీపల్లె, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు మండలాల్లోని ప్రజలు టీడీపీని ఆదరించారు. నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి ఎక్కడా ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా, ఎటువంటి ఉత్కంఠ రేకెత్తించకుండా నల్లేరుపై నడక లాంటి విజయాన్ని అందించారు. దీంతో అసాధారణ రీతిలో 25,081 ఓట్ల మెజారిటీతో విజయాన్ని అందుకున్నారు. పీలేరు మండల ప్రజలు కిశోర్ కుమార్ రెడ్డికి సుమారు 8 వేల మెజారిటీ అందించగా ఆయన స్వంత మండలమైన కలికిరి ప్రజలు 6 వేల ఆధిక్యత అందించారు. పీలేరు మండలంలో వైసీపీ నాయకులు చేసిన భూఆక్రమణలు, సాగించిన దౌర్జన్యకాండపై పోరాడిన కిశోర్‌కు ప్రతిఫలంగా పీలేరు మండల ప్రజలు ఆ మెజారిటీ అందించినట్లు టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇక చింతల రామచంద్రారెడ్డి స్వంత మండలమైన వాల్మీకిపురంలోనూ కిశోర్‌కు 1750 ఓట్ల మెజారిటీ దక్కింది.

పోస్టల్ బ్యాలెట్స్‌లోనే చెల్లని ఓట్లు

మే 13న జరిగిన పోలింగ్‌లో సాధారణ ప్రజలందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఆ రోజున వేసిన ఓట్లన్నీ చెల్లుబాటయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనే చెల్లని ఓట్లు నమోదయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 3,854 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవగా అందులో 12 మంది నోటాకు ఓటు వేశారు. మిగిలిన 3842 ఓట్లలో దాదాపు 10 శాతం 345 ఓట్లు తిరస్కరణకు గురై చెల్లకుండా పోయాయి.

మండలాల వారీగా	ఆధిక్యత
గుర్రంకొండ	2319
కలకడ	1800
కేవీపల్లె	3755
వాల్మీకిపురం	1750
కలికిరి	6089
పీలేరు	7925
పోస్టల్ బ్యాలెట్స్	1443

ఎవరికి ఎన్ని ఓట్లు	
నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి(టీడీపీ)	105582
చింతల రామచంద్రారెడ్డి(వైసీపీ)	80501
బిసోమశేఖర రెడ్డి(కాంగ్రెస్)	3403
ఇతరులు(9 మంది)	2386
చెల్లని ఓట్లు	345
నోటా	1869

చింతల స్వస్థలంలోనూ కిశోర్‌కు ఆధిక్యం

వైసీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి స్వస్థలమైన వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లె పోలింగ్ కేంద్రంలో టీడీపీ అభ్యర్థి కిశోర్‌కు ఆధిక్యం లభించింది. ఆ బూత్‌లో కిశోర్‌కు 353 ఓట్లు పోలవగా, చింతలకు 340 ఓట్లు లభించాయి.

నాడు విజేత, నేడు పరాజితుడు

పాత వాల్మీకిపురం నియోజకవర్గం(ప్రస్తుతం పీలేరు)లో చివరిసారిగా 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. అప్పుడు టీడీపీ తరపున చింతల రామచంద్రారెడ్డి పోటీ చేసి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిపై విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో అదే కిరణ్ కుమార్ రెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. 2004 ఎన్నికల్లో ఆయనకు టీడీపీ టిక్కెట్టు దక్కకపోడంతో పోటీకి దూరంగా ఉండిపోయారు. 2009లో ఆయన ప్రజారాజ్యం తరపున పోటీ చేసి ఓడిపోయారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. పాతికేళ్ల తరువాత టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. దీంతో చింతలతో ఆగిపోయిన టీడీపీ విజయ పరంపర, మళ్లీ ఆయన ఓటమితో మొదలైందని టీడీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి.

మదనపల్లె ఎన్నికల్లో ఎవరెవరికి ఎన్ని ఓట్లంటే..

మదనపల్లె టౌన్, జూన్ 5: మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఎన్నికల్లో 15 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు, కొన్ని రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్రులు పోటీ చేశారు. వీరిలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషాకు 97,980, వైసీపీ అభ్యర్థి నిస్సార్‌అహ్మద్‌కు 92,471, కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డికి 6,051, స్వతంత్ర్య అభ్యర్థులైన నరసింహులుకు 1,220, కృష్ణప్పకు 305, భాస్కర్‌కు 153, మణిశంకర్‌కు 121, ఉమాదేవికి 213, గుల్నాజ్‌బేగంకు 142, జయసింహకు 186, ఎస్.నిస్సార్ అహ్మద్‌కు 479, నరసింహులునాయక్‌కు 122, జనార్ధన్‌కు 138, షాజహాన్‌కు 1,288, ఆజిద్‌బాషాకు 243 ఓట్లు పోల్ అయ్యాయి. కాగా నోటాకు 1,759 ఓట్లు పడగా, పోస్టల్ బ్యాలెట్‌లలో 27 ఓట్లు నోటాకు పోలయ్యాయి.

మండలంలో పోలైన ఓట్లతోనే..

మండలంతో పాటు, పట్టణంలో పోలైన ఓట్లతోనే టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా విజయం సాధించారని లెక్కలు చెబుతున్నాయి. మదనపల్లె నియోజకవర్గంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలతో పాటు మదనపల్లె పట్టణం ఉంది. ఇందులో షాజహాన్‌బాషాకు పట్టణంలో 5,844, మదనపల్లె మండలంలో 1,790, పోస్టల్ బ్యాలెట్‌లో 1,390 మెజారిటీ రాగా, మొత్తం మీద 5,509 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వైసీపీ అభ్యర్థి నిస్సార్ అహ్మద్‌కు నిమ్మనపల్లె మండలంలో 812 ఓట్లు, రామసముద్రంలో 2,703 ఓట్ల మెజారిటీ సాధించడం గమనార్హం.

ఎన్డీయే విజయంపై సంబరాలు



కేకు కట్ చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

తంబళ్లపల్లె, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించినందుకు తంబళ్లపల్లెలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం టీడీపీ రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం భారీ ఎత్తున బాణసంచా పేల్చి భారీ కేకు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉత్తమ్‌రెడ్డి, బేరిశీన, వెంకటరెడ్డి, సోముశేఖర్, కాలా నారాయణ, సుధాకర్‌రెడ్డి, రవిచంద్ర, రామ్మోహన్‌రెడ్డి, బీసీ కృష్ణమూర్తి, రామచంద్ర, జనసేన నాయకులు సుబహాన్, సురేష్, రఘు, రంగయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పారు

కురబలకోట, జూన్ 5: అవినీతి ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపారని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ తెలిపారు. బుధవారం మండ లంలోని అంగళ్ళులో టీడీపీ గెలుపుపై కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో అక్రమాలు, దౌర్జన్యాలు హెచ్చుమీరడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి న్యాయం చేస్తామన్నారు. గాడితప్పిన ప్రభుత్వాన్ని తిరిగి గాడిలో పెడతారన్నారు. సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అఖండ మెజారిటీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, బొగ్గుభాస్కర్, వెంకటరమణా రెడ్డి, వెంకటరమణారెడ్డి, మధుకర్ రెడ్డి. శంకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సదాశివ, తెట్టు ఉపసర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సన్మానం



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను అభినందిస్తున్న టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి, తదితరులు

మదనపల్లె, జూన్ 5: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎం.షాజహాన్‌బాషాను బుధవారం బసినికొండ గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో నటశేఖర్, విజయ్‌కుమార్, లక్ష్మన్న, విజయ్ కుమార్, బి.వెంకటరమణ, బాలాజీ ఎలక్ట్రికల్ రమణ, రమేష్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్: టీడీపీ సీనియర్ నేత మార్పురి సుధాకర్‌నాయుడు, విజయభారతి విద్యాసంస్థల సేతు, శివరామ్, బలిజ సంఘం నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, పోర్డ్ లలితమ్మ, చైతన్య అనాథాశ్రమం ఆనంద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, జేకే వర్మ, , టీడీపీ, జనసేన నాయకులు అభినందించినవారిలో ఉన్నారు.

నగిరిపల్లెకు తరలిన నాయకులు, కార్యకర్తలు



నల్లారితో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు



ప్రజలకు నమస్కరిస్తున్న నల్లారి ఆర్యవణ్ రెడ్డి

వాల్మీకిపురం, జూన్ 5: నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఘనవిజయం నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది. మండలానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు నగిరిపల్లె లోని నల్లారి నివాసానికి చేరుకుని ఆయన్ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఆదరిం చిన వాల్మీకిపురం ప్రజలను ఎన్నటికీ మరువనని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ ఘన విజయాన్ని ఊరికే పోనివ్వనని నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, జనసేన పీలేరు ఇన్‌చార్జి బెజవాడ దినేష్, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు కృష్ణారెడ్డి, పులి సత్యారెడ్డి, రాజేంద్రాచారి, చంద్రమౌళి, శేషాద్రిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ మహిత, సుధాకర్ రెడ్డి, చంద్రారెడ్డి, పీవీ నారాయణ, వెంకటరమణ, మురళి, కువైట్ బాబు, చాను, మస్కట్ మస్తాన్, కువైట్ సయ్యద్‌బాషా, ఎండీ యూసుఫ్, బొక్కసం రామకృష్ణ, ఆనంద్, డిష్ బ్రదర్స్, మెకానిక్ చాను, మొహ్మద్‌హుస్సేన్, సాదిక్, జంషీద్, షబ్బీరుల్లాఖాన్, జావీద్, ఆదినారాయణ, దండువారిపల్లె రమణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులకు ఆర్యవణ్ రెడ్డి ధన్యవాదాలు

కలికిరి: నల్లారి కుటుంబంలో ఐదో తరం ప్రజల మధ్యకొచ్చింది. టీడీపీ శ్రేణులకు ఈ సన్నివేశం కొత్త ఉత్సాహాన్ని తెచ్చిపెట్టింది. బుధవారం నగరిపల్లెలో ఆ కుటుంబంలో ఐదో తరానికి చెందిన కిశోర్‌కుమార్ రెడ్డి మనుమడు నల్లారి ఆర్యవణ్ రెడ్డి అకస్మాత్తుగా ప్రజల ముందుకొచ్చి అందరికీ అభివాదం చేయడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. రెండేళ్ళ ఆర్యవణ్ రెడ్డి పదే పదే అందరికీ అభివాదాలు చెప్పడం పలువురిని ఆకర్షించింది. ఈ పిల్లాడి తండ్రి డాక్టర్ అమరనాథ రెడ్డి, తల్లి డాక్టర్ షమా రెడ్డి (కిశోర్‌కుమార్ రెడ్డి తనయుడు, కోడలు) మొన్నటి ఎన్నికల ప్రచారంలో నియోజవర్గ వ్యాప్తంగా గుర్తింపు పొందారు. దీంతో ఆర్యవణ్ రెడ్డి అభివాదాలకు ప్రతిగా ప్రజలు ఈలలు, కేకలతో కేరింతలు కొట్టారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి మంచి రోజులు..

బి.కొత్తకోట, జూన్ 5: కూటమి సాధించిన ఘనవిజయంతో ఇక రాష్ట్రానికి అన్నీ మంచిరోజులేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ వ్యాఖ్యానించారు. బుధవారం బి.కొత్తకోట జ్యోతిసర్కిల్‌లో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రలోభాలకు లొంగకుండా టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి కోసం పనిచేసిన కార్యకర్తలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం భారీకేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. మండలంలోని బండారువారిపల్లె లో సైతం టీడీపీ కార్యకర్తలు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డేరింగులనారాయణ, చావిడికిట్టన్న, యండీ మస్తాన్, నాజర్, ముస్తఫా, గట్టురెడెప్ప, ప్రభాకర్, రవికుమార్, శిల్పాఆంజి, మదార్‌సాబ్, పద్మనాభ, అమర, శంకర, నాగరాజు, శీనప్ప,శివరాం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



వాల్మీకిపురం:మొక్కలు నాటుతున్న డాక్టర్ ఫైరోజాబేగం

వాల్మీకిపురం, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఇంపాక్ట్ ఇంటర్‌నేషనల్ స్ఫూర్తి అన్నమయ్య క్లబ్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.డాక్టర్లు సోని, శివాణి, కిశోర్, అన్నమయ్య క్లబ్ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని విస్మరిస్తే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమే..

కురబలకోట: మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్ అధ్యాపకులు ప్రదీప్‌కుమార్, దీపాంకర్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: వెలిగల్లు, గుర్రంవాడ్లపల్లి, ముసలికుంట. గుడిసెవారిపల్లిలోని పాఠశాల ప్రాంగణాల్లో ఫోర్డు, క్రై సంస్థ సభ్యులు, ప్రజలు మొక్కలు నాటారు. ఫోర్డు సంస్థ బాధ్యులు లలితమ్మ, కోఆర్డినేటర్ నరసింహులు, క్రై సంస్థ సభ్యులు, భువనేశ్వరి, రెడ్డమ్మ, రమణ పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్: జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పట్టణంలో పలుచోట్ల మొక్కలను నాటారు. ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, అధ్యాపకులు రెడ్డెప్ప, మునీంద్రనాయక్ పాల్గొన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి , ప్రిన్సిపాల్ సతీష్ బాబు, అధ్యాపకులు అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనం ప్రభంజనం సృష్టించారు : జయచంద్రారెడ్డి



కేక్ కట్ చేస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 5: చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విజయమందించి జనం ప్రభంజనం సృష్టించారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా అధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం జయచంద్రారెడ్డి కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుపై ఇంతటి ఆదరణ చూపిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లి కార్జున నాయుడు, జనసేన ఇన్‌చార్జి పోతులు సాయినాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, వైజీ సురేంద్ర యాదవ్, నేతలు చెన్నకిష్టా, గాండ్ల రెడ్డెప్ప, కేవీ రమణ, నాయకులు తంబళ్ళ శివన్న, ప్రతాప్‌నాయుడు, భజంత్రి రామాంజులు, నాగేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెను జిల్లా చేస్తామన్నందుకే గెలిపించారు

మదనపల్లె అర్బన్, జూన్ 5: మదన పల్లెను జిల్లా కేంద్రంగా చేస్తామన్నం దుకే టీడీపీ కూటమి అభ్యర్థి. షాజ హాన్‌బాషాను గెలిపించారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రెడ్డి సాహెబ్ అన్నారు. బుధవారం స్థాని క కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఐదేళ్లుగా విసిగి వేసారిపోయిన ప్రజలు ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలసిన బాధ్యత సీఎం చంద్రబాబు నాయుడు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌పై ఉందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లె జిల్లాగా ప్రకటిస్తామని చేసిన హామీని వెంటనే అమలు చేయాలని గుర్తు చేశారు. దేశంలో రాహుల్‌గాంధీ, రాష్ట్రంలో షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాబోవు ఐదేళ్లలో అధికారం చేజిక్కించుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా, మీనాకుమారి, సమీరుద్దీన్, మహబూబ్‌పీర్, ఈశ్వరమ్మ, శరత్‌కుమార్‌రెడ్డి, సమీర్, నాగరాజ, అల్లాబక్ష, ఖాసీం, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం.. ఎంపీడీవో ఆగ్రహం



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో పోలప్ప

ములకలచెరువు, జూన్ 5: ఎనిమిది నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా పరిష్కారానికి సమయం దొరకలేదా అని ఎంపీడీవో పోలప్ప పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పైపులు తొలగించడంతో మదనపల్లె రోడ్డులోని గృహాలకు కొళాయి నీరు అందడం లేదు. ఈ విషయం ఎనిమిది నెలలుగా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ప్రయోజనం లేదని స్థానికులు తోట గిరిధర్, పాలగిరి సిద్ధా తదితరులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం స్పందించిన ఎంపీడీవో పోలప్ప మదనపల్లె రోడ్డులో పర్యటించి సాయంత్రంలోగా సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీంను ఆదేశించారు.

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం

● ఎరువుల దుకాణంలోకి వర్షపు నీరు..రూ.లక్ష నష్టం



దుకాణంలోకి వెళ్ళిన వర్షపు నీరు

ములకలచెరువు, జూన్ 5: ముంబై - చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం కారణంగా ఓ దుకాణదారు తీవ్రంగా నష్టపోయాడు. ఎరువుల దుకాణంలోకి నీరు చేరి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. బాధితుడి కథనం మేరకు... మంగళవారం కురిసిన భారీ వర్షానికి ములకలచెరువు బంగ్లా ఎదురుగా ఉన్న బొంతల ప్రొవిజన్ స్టోర్‌లోకి నీరంతా చేరింది. దీంతో దుకాణంలో ఉన్న ఎరువుల బస్తాలు నీట మునిగాయి. ఉదయం దుకాణం తలుపులు తీసిన యజమాని మహేష్ కంగుతిన్నాడు.ఈ విషయమై బాధితుడు ఎంపీడీవో పోలప్ప, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీంకు ఫిర్యాదు చేశాడు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

మదనపల్లె టౌన్, జూన్ 5: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ తెలిపారు. బుధవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో పయనింపచేసేంది చంద్రబాబునాయుడే అన్నారు. ప్రజలు కూటమిపై విశ్వాసం చూపి అఖండ మెజారిటీతో గెలిపించారన్నారు. వైసీపీని రాష్ట్ర ప్రజలు చీ కొట్టారన్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్ చూపిన చొరవ, త్యాగం ఆ పార్టీకి వందశాతం విజయం అందించిందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు, ఇచ్చిన హామీలను చంద్రబాబు నిలబెట్టుకుంటారన్నారు. ఈ సమావేశంలో రామసముద్రం టీడీపీ అధ్యక్షుడు విజయగౌడ్, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి విజయమ్మ, అన్వర్‌బాషా, భువనేశ్వర్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు, లోకేశ్‌కు చినబాబు అభినందనలు



చంద్రబాబుకు అభినందనలు తెలుపుతున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, జూన్ 5: రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భారీ మెజారిటీతో విజయం సాధించడంతో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు అభినందనలు తెలిపారు. బుధవారం ఉదయమే చంద్రబాబు నివాసానికి చేరుకున్న ఆయన ఇద్దరు నేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

మోదీతోనే దేశాభివృద్ధి

మదనపల్లె అర్బన్, జూన్ 5: దేశంలో బీజేపీ ఘన విజయం సాధించడానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు మదనపల్లె బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో మదనపల్లె అసెంబ్లీ కన్వీనర్ భగవాన్ ధన్యవాదాలు తెలిపారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ మూడో సారి ప్రధానమంత్రిని చేయడానికి ప్రజలు సహకరించారన్నారు. రాష్ట్రంలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ఇంత మెజార్టీని తెచ్చిపెట్టిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజానికానికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భవానీ, వేణుగోపాల్, వెంకటరమణ పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అవగాహన



బీసీజీ టీకాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వాల్మీకిపురం, జూన్ 5: క్షయ (టీబీ) వ్యాధి లేని భారతదేశం లక్ష్య సాధ న దిశగా బీసీజీ టీకా కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యులు శ్రీవిద్య తెలిపారు. మండలంలోని విఠలం, బోయపల్లె, తదితర గ్రామాల్లో బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ టీకాతో టీబీ మరణాల తీవ్రతను నివారణ, రోగ నిరోధక శక్తిని ఇస్తుందన్నారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చంటి పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

కలకడ, జూన్ 5: చంటి పిల్లల ఆరోగ్యంపై తల్లులు శ్రద్ధ చూపాలని డాక్టర్ కిశోర్‌కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి కదిరాయచెరువు గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న వీరాభిమాని



టెంకాయలు కొడుతున్న సుబ్బమ్మ

మదనపల్లె టౌన్, జూన్ 5: రాష్ట్రానికి చంద్రబాబు సీఎం కావాలని మొక్కుకున్న వీరాభిమాని బుధవారం 501 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. స్థానిక నీరుగట్టు వారి పల్లెకు చెందిన దొడ్డ సుబ్బమ్మ మాట్లాడుతూ సీఎం అయ్యాకే అసెంబ్లీకి వస్తానని శపథం చేసిన చంద్రబాబు సీఎం కావాలని తాను ఆంజనేయస్వామికి మొక్కుకున్నానన్నారు. నేడు కూటమికి అఖండ మెజారిటీ రావడం, మదనపల్లె ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా గెలవడంతో మారుతినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో 501 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నానన్నారు. మాజీ కౌన్సిలర్ ఆంజనేయులు, పురాణం రత్న, సత్యనారాయణ, రాజన్న, శంకర, తదితరులు పాల్గొన్నారు.